FOR ADS.......
ఆకాంక్ష
CONTACT :
8333818121

# తొలి ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను

ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ... అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..

సంప్రదించండి...

8333818121

ఎడిటర్ పెనగొండ సతీష్
తొలి ఆకాంక్ష TGTEL/25/A1964 akankshanews.com తెలుగు సంచలన దిన పత్రిక

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :198 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజిలు : 08, వెల. 5రూ/ మంగళవారం- 10 - మార్చి - 2026

## మహిళల గురించి జగన్ మాట్లాడడం హాస్యాస్పదం



వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మరోసారి నిప్పులు చెరిగారు.

సోమవారం శ్రీ సత్యసాయి జిల్లాలోని పెనుకొండలో మంత్రి సవిత విలేకర్లతో మాట్లాడుతూ..

వైఎస్ జగన్ మహిళల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

పెనుకొండ, మార్చి 09: వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మరోసారి నిప్పులు చెరిగారు. సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మిగతా..2లో

## వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించిన కవిత




బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్న కవిత

ప్రభుత్వం బాధితులకు అండగా లేదని విమర్శ

బాధితులతో కలిసి జెడ్పీ కూడలిలో ఆందోళన

పోలీసులు సర్దిచెప్పడంతో నిరసన విరమించిన కవిత

హైదరాబాద్: ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖమ్మం నగరం జెడ్పీ కూడలిలో ఆందోళనకు చేపట్టారు. ఖమ్మంలోని అంబేద్కర్ భవనంలో వెలుగుమట్ల బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాధితులకు న్యాయం జరిగే వరకు తాము అండగా ఉంటామని అన్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు బాధితులకు మద్దతుగా లేదని మండిపడ్డారు. మిగతా..2లో

## రైతుల రుణాలపై కేంద్రం కీలక ప్రకటన



- దేశవ్యాప్తంగా రైతులకు వ్యవసాయ రుణాలు కింద మొత్తం రూ.31,34,807 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.
- సోమవారం లోక్‌సభలో డీఎంకే సభ్యుడు రాజు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు.

న్యూఢిల్లీ, మార్చి 09: దేశవ్యాప్తంగా రైతులకు వ్యవసాయ రుణాలు కింద మొత్తం రూ.31,34,807 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

## గచ్చిబౌలి స్టేడియంను అంతర్జాతీయ ప్రమాణాలతో

# పునర్నిర్మించాలి

- మెగా ఈవెంట్లలో పతకాలు సాధించడమే లక్ష్యమన్న సీఎం
- యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీని సిద్ధం చేయాలని ఆదేశం
- ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేలా ఉండాలన్న రేవంత్



వివరాలు 2లో..

హైదరాబాద్: తెలంగాణను అంతర్జాతీయ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యం దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక అడుగులు వేశారు. ఒలింపిక్స్ వంటి మెగా ఈవెంట్లలో రాష్ట్ర క్రీడాకారులు పతకాలు సాధించడమే ధ్యేయంగా 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో క్రీడాశాఖపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం భవిష్యత్తు ప్రణాళికలను ఖరారు చేశారు. ప్రధానంగా గచ్చిబౌలి స్టేడియంను అంతర్జాతీయ ప్రమాణాలతో పునర్నిర్మించాలని సీఎం సూచించారు. అక్కడ ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలతో పాటు యూనివర్సిటీ కాంప్లెక్స్, అత్యాధునిక హాస్టల్ భవనాలు, వివిధ క్రీడల శిక్షణా కేంద్రాలను అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీనికి సంబంధించి పలు ఆర్కిటెక్చర్ నమూనాలను

## రాహుల్ బంధు కింద రేవంత్ రెడ్డి రూ.1000 కోట్లు పంపిస్తున్నారు

- కేసీఆర్ హయాంలో డిసెంబర్ నెలలో రైతుబంధు పడేదన్న కేటీఆర్
- ఇప్పుడు కోతల సమయం వచ్చినా రైతుబంధు పడలేదన్న కేటీఆర్
- రుణమాఫీ చేశానని అనుకుంటున్నానని రేవంత్ రెడ్డి చెప్పడం విడ్డూరమని వ్యాఖ్య



హైదరాబాద్: 'రాహుల్ బంధు' పథకం కింద ప్రతి సంవత్సరం రూ.1000 కోట్లు ఇచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవిని కాపాడుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సిరిసిల్లలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ హయాంలో డిసెంబర్ నెలలో రైతుబంధు పడేదని, కానీ ఇప్పుడు కోతల సమయం వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం వేయలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనలో రైతుబంధును నిలిపివేసి 'రాహుల్ బంధు' పేరుతో కొత్త పథకం తెచ్చారని ఎద్దేవా చేశారు. తన పదవిని కాపాడుకోవడం కోసం మిగతా..2లో

## మొజ్తాబా ఖమేనీకి పుతిన్ అభినందనలు, కొత్త సుప్రీంను టార్గెట్ చేయవద్దన్న చైనా



- ఇరాన్ కొత్త సుప్రీం నేత మజ్తాబా ఖమేనీకి రష్యా అభినందనలు చెప్పగా, కొత్త సుప్రీంను
- మట్టుబెడతామంటూ ఇజ్రాయెల్ మిలటరీ చేస్తున్న హెచ్చరికలతో చైనా విభేదించింది.

టెహ్రాన్: అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు జరిపి ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీని మట్టుబెట్టడంతో

## భారతీయుల భద్రత మా ప్రాధాన్యం'- విపక్షాల నినాదాల మధ్యే పశ్చిమాసియా ఉద్రిక్తతలపై జైశంకర్ వివరణ

- ఇరాన్ యుద్ధ పరిస్థితులపై ఉభయల్లో మాట్లాడిన జైశంకర్
- శాంతి, దౌత్య చర్చలకే మద్దతు అంటూ వెల్లడి



ఢిల్లీ : పశ్చిమాసియాలో పరిస్థితులు తీవ్ర ఆందోళనలు కలిగిస్తున్నాయని, యుద్ధ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నామని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు. చర్చలు, దౌత్యపరంగా సమస్య పరిష్కారమవుతుందని భారత్ నమ్ముతుందని పేర్కొన్నారు. పశ్చిమాసియా ప్రాంతాల్లో నివసిస్తున్న భారతీయుల సంక్షేమం, భద్రతపై తమ ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఇరాన్ యుద్ధం, తదితర పరిణామాలపై పార్లమెంట్ లోని రెండు సభల్లోనూ జైశంకర్ ఈ మేరకు కీలక ప్రకటన చేశారు. ఈ ప్రకటనకు ముందు చర్చ చేపట్టాలని విపక్ష సభ్యులు పట్టు బట్టాయి. ప్లకార్డులు ప్రదర్శించారు. నినాదాల మధ్యే ప్రకటన చేస్తున్న జైశంకర్ వివరించారు. పశ్చిమాసియాలోని పరిస్థితులను ప్రధాని మోదీ పర్యవేక్షిస్తున్నారని సంబంధిత శాఖలన్నింటికీ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారని జైశంకర్ తెలిపారు. శాంతికి ఎలాంటి విఘాతం కలిగినా ప్రపంచం మెత్తం ప్రభావం ఉంటుందని చెప్పారు. దాడుల వల్ల అంతర్జాతీయ మార్కెట్ లో ముడి చమురు ధరలు పెరగడంపై జైశంకర్ మాట్లాడుతూ భారత వినియోగదారుల ప్రయోజనాలు ఎప్పటికీ ప్రాధాన్యతగా ఇస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఇంధన భద్రత, వాణిజ్య లక్ష్యాల విషయంలో రాజీ పడబోమని చెప్పారు. భారత వినియోగదారులపై భారం పడకుండా, చమురు లభ్యత, ధరలను నియంత్రించేందుకు దౌత్యపరంగా కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. మిగతా..2లో

## నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు

- బంగాల్ పర్యటన ముగిసిన తర్వాత ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు అవకాశం
- ఐదు ప్రాంతాల్లో మొదటిసారి అన్ని పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్
- స్థానిక పండుగలను దృష్టిలో ఉంచుకుని తేదీల నిర్ణయం



ఢిల్లీ : దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించిన అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఈ వారం ప్రకటించే అవకాశం ఉందని ఎన్నికల సంఘం వర్గాలు తెలిపాయి. అసోం, కేరళ, తమిళనాడు, బంగాల్ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించేందుకు ఎన్నికల సంఘం సిద్ధంగా ఉందని సమాచారం. ప్రస్తుతం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలోని పూర్తి స్థాయి ఎన్నికల సంఘం బృందం బంగాల్ లో పర్యటిస్తోంది. ఆ బృందంలో ఎన్నికల కమిషనర్లు సుఖ్ బిర్ సింగ్ సంధు, వివేక్ జోషి కూడా ఉన్నారు. బంగాల్ లో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన తర్వాత ఈ బృందం మార్చి 10న ఢిల్లీకి తిరిగి వెళ్లనుంది. అక్కడ ఎన్నికల ఏర్పాట్లపై అన్ని రాష్ట్రాల్లో సమీక్ష పూర్తి చేసిన తర్వాత ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశముందని ఎన్నికల సంఘం వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే అసోం, తమిళనాడు, పుదుచ్చేరి, మిగతా..2లో

## రేవేంద్రపాడులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేశ్



- మంత్రి నారా లోకేశ్ ఘనస్వాగతం పలికిన స్థానికులు, టీడీపీ శ్రేణులు
- భారీ ర్యాలీ మధ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన విద్యా, ఐటీ శాఖల మంత్రి
- ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు
- కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు

## క్యూఆర్ కోడ్ తో కొత్త పాసు పుస్తకాలు

# ఎవరు తప్పు చేసినా వెంటనే తెలుస్తోంది

- వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దుతున్నామన్న సీఎం
- ట్యాంపరింగ్ జరగకుండా కొత్త పాసుపుస్తకాలు
- కూటమి ప్రభుత్వంలో కరెంట్ ఛార్జీలు పెంచబోమని స్పష్టం




అమరావతి : ఒక్క పైసా కూడా అవినీతి లేకుండా పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దుతూ ట్యాంపరింగ్ జరగకుండా కొత్త పాసు పుస్తకాలు ఇస్తున్నామన్నారు. భవిష్యత్‌లోనూ ఎక్కడా తప్పులు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. నంద్యాల జిల్లా కొత్తబురుజు గ్రామసభలో పాల్గొని రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. క్యూఆర్ కోడ్ తో ఇచ్చే పాసు పుస్తకాలతో ఎవరు తప్పు చేసినా వెంటనే తెలుస్తోందన్నారు. రాయలసీమను రతనాల సీమగా మార్చుతాం: ప్రజలు అభిమానించే పాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. సుస్థిరమైన పాలనతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. మిగతా..2లో

## వసంతం మాయం మార్చిలోనే మండుతున్న ఎండలు



- శీతాకాలం వెళ్లగానే మొదలైన వేసవి తాపం
- ప్రకృతి ఆనవాళ్లు దెబ్బతిన్న వైనం
- వాతావరణ మార్పుల వల్లే ఈ విపరీతం అంటున్న నిపుణులు
- కర్నూలులో అప్పుడే 39 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత

మొదటి పేజ తరువాయి

## రేవేంద్రపాడులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేశ్

అమరావతి: మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నేడు లాంఛనంగా ఆవిష్కరించారు. ఇవాళ రేవేంద్రపాడు చేరుకున్న మంత్రి లోకేశ్ కు స్థానిక ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మధ్య ఉత్సాహభరిత వాతావరణంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ జరిగింది. విగ్రహావిష్కరణ తరువాత అక్కడ ఉన్న ఎన్టీఆర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు లోకేశ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమానికి వచ్చిన అభిమానులు, కార్యకర్తలతో ఆయన కాసేపు ముచ్చటించి, వారితో కలిసి ఫోటోలు దిగారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, దుగ్గిరాల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కాసరనేని జశ్వంత్, దుగ్గిరాల మండల టీడీపీ అధ్యక్షురాలు కేశినేని శ్రీఅనిత తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, స్థానికులు తరలిరావడంతో రేవేంద్రపాడులో కోలాహలం నెలకొంది.

## గచ్చిబౌలి స్టేడియంను అంతర్జాతీయ ప్రమాణాలతో పునర్నిర్మించాలి

పరిశీలించిన ఆయన, భవిష్యత్తులో ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా మౌలిక సదుపాయాలు ఉండాలని స్పష్టం చేశారు. కేవలం గచ్చిబౌలి మాత్రమే కాకుండా, హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం, కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియాలను కూడా ఆధునికీకరించాలని నిర్ణయించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ క్రీడాకారుల ప్రతిభను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే ఈ స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం వెల్లడించింది.

## మహిళల గురించి జగన్ మాట్లాడడం హాస్యాస్పదం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సవిత మాట్లాడుతూ.. వైఎస్ జగన్ మహిళల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిండు అసెంబ్లీలో తల్లి లాంటి నారా భువనేశ్వరిని అవమానించారంటూ మండిపడ్డారు. సొంత తల్లి, చెల్లికి, చిన్నాన్న కుమార్తెకు న్యాయం చేయని వ్యక్తి వైఎస్ జగన్ అని అభివర్ణించారు. ఇంట్లో వారిని బజారు పాలు చేశారంటూ జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి, పులివెందులలో మహిళలపై జరిగిన అత్యాచారాలు, దారుణాలు అంతా చూశారన్నారు. మహిళా ద్రోహి సీఎం చంద్రబాబు అంటూ జగన్ మాట్లాడడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రశ్నిస్తే మహిళలపై కూడా కేసులు పెట్టారంటూ సీఎంగా జగన్ వ్యవహరించిన తీరును ఈ సందర్భంగా మంత్రి సవిత తూర్పారబట్టారు. హిందువులు, మహిళలు, బీసీల అభివృద్ధి అంటే సరిపోదంటూ జగన్‌కు చురకలంటించారు. మీ హయాంలో జరిగిన అరాచకాలపై నివేదిక తయారు చేసి గవర్నర్‌కు ఇప్పటికే అందజేశామన్నారు. రాయలసీమ సాగునీటి గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదని కుండ బద్దలు కొట్టారు. వారు రాయలసీమ ద్రోహులున్నారు. ఏ రోజు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదంటూ వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డైవర్షన్ పాలిటిక్స్ కోసం వైసీపీ నాయకులు సభలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. అయితే ప్రజలు, మహిళలు చాలా క్లారిటీగా ఉన్నారు. మహిళా సాధికారత గురించి ఆలోచించింది పూలే ఆ తర్వాత డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ అని మంత్రి సబితా తెలిపారు. ఇప్పుడు ఎన్టీఆర్ తర్వాత చంద్రబాబు మాత్రమే మహిళా సాధికారత కోసం పని చేస్తున్నారని స్పష్టం చేశారు. మహిళలకు అన్ని అంశాల్లో ప్రాధాన్యత కల్పించింది సీఎం చంద్రబాబేనని పేర్కొన్నారు. ప్రతి ఇంటా మహిళా ఎంటర్ ప్రెన్యూర్ రావాలన్నదే చంద్రబాబు లక్ష్యమని స్పష్టం చేశారు.

## రాహుల్ బంధు కింద రేవంత్ రెడ్డి రూ.1000 కోట్లు పంపిస్తున్నారు

రేవంత్ రాహుల్ బంధు పథకం కింద గాంధీ కుటుంబానికి వెయ్యి కోట్ల రూపాయలు ఇస్తున్నాడని ఆరోపించారు. అందుకే కేసీఆర్ ముందే చెప్పారని, ఆలోచించి జాగ్రత్తగా ఓటు వేయాలని సూచించారని తెలిపారు. రేవంత్ రెడ్డి మూడుసార్లు రైతుబంధును ఎగ్గొట్టారని విమర్శించారు. "నేను రుణమాఫీ చేశానని అనుకుంటున్నా, రైతుబంధు వేశానని అనుకుంటున్నా" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల అన్నారని, అసలు ఆయన ముఖ్యమంత్రేనా అని నిలదీశారు. మరి ముఖ్యమంత్రిగా మీరెందుకు ఉన్నారని ప్రశ్నించారు. రైతుబంధు వేస్తే, రుణమాఫీ ఇస్తే మీకు తెలియకుండా ఉండటమేమిటని అన్నారు. హైదరాబాద్‌లో దోమలు బాగా పెరిగిపోయాయని, కానీ నగరంలో చెత్తను మాత్రం తీయడం లేదని విమర్శించారు.

## రైతుల రుణాలపై కేంద్రం కీలక ప్రకటన

సోమవారం లోక్‌సభలో డీఎంకే సభ్యుడు రాజు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. పంట రుణాలు కింద రూ.16,34,219 కోట్లు.. టర్మ్ లోన్స్ కింద రూ.15,00,588 కోట్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే పలు రాష్ట్రాల రైతుల అప్పుల భారాన్ని ఈ సందర్భంగా గణాంకాలతో సహా వెల్లడించారు. ఈ జాబితాలో తమిళనాడు అగ్రస్థానంలో నిలవగా.. తెలుగు రాష్ట్రాలు ఏపీ రెండు, తెలంగాణ ఏడో స్థానాల్లో ఉన్నాయి.

## మొజ్తాబా ఖమేనీకి పుతిన్ అభినందనలు, కొత్త సుప్రీంను టార్గెట్ చేయవద్దన్న చైనా

పశ్చిమాసియాలో తలెత్తిన ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. మధ్యప్రాచ్యంలో ఇజ్రాయెల్ తన దాడులను లెబనాన్, బీరుట్‌కు విస్తరించింది. ఇరాన్ సైతం ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్‌లతో విరుచుకుపడుతోంది. ఇరాన్‌ను విడగొట్టి దేశం నుంచి చమురును తరలించాలని అమెరికా ప్లాన్ చేస్తోందని టెహ్రాన్ ఆరోపిస్తోంది. ఇరాన్ కొత్త సుప్రీం నేతగా ఎన్నికైన మొజ్తాబా ఖమేనీకి పూర్తి బాసటగా నిలుస్తామని ఆదేశ మిలటరీ ప్రకటించింది. తాజాగా ఇరాన్ కొత్త సుప్రీం నేతకు రష్యా అభినందనలు చెప్పగా, కొత్త సుప్రీంను మట్టుబెడతామంటూ ఇజ్రాయెల్ మిలటరీ చేస్తున్న హెచ్చరికలతో చైనా విభేదించింది.

### దేశాన్ని ముందుకు నడిపించండి: పుతిన్

ఇరాన్ కొత్త సుప్రీం నేతగా నియమితులైన మొజ్తాబా ఖమేనీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ అభినందనలు తెలియజేశారు. ఈ విషయాన్ని క్రెమ్లిన్ వెల్లడించింది. మొజ్తాబా తన తండ్రి అలీ ఖమేనీ వారసత్వాన్ని కొనసాగిస్తూ దేశాన్ని గౌరవప్రదంగా ముందుకు నడిపిస్తారన్న ఆశాభావాన్ని పుతిన్ వ్యక్తం చేశారు. కొత్త నేత ప్రస్తుత సంక్లిష్ట దశలో దేశానికి దిశానిర్దేశం చేస్తూ ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తారని నమ్ముతున్నట్టు పేర్కొన్నారు.

### నాయకత్వ మార్పిడి అంతర్గత విషయం: చైనా

ఇరాన్ సుప్రీం నేతగా ఎవరిని ఎన్నుకున్నా తమ తదుపరి టార్గెట్ ఆయనే అవుతాడని ఇజ్రాయెల్ మిటలరీ ఇటీవల చేసిన హెచ్చరికలపై చైనా ఘాటుగా స్పందించింది. నాయకత్వ మార్పిడి అనేది ఆదేశ అంతర్గత వ్యవహారమని, ఇరాన్ సార్వభౌమాధికారం, భద్రత, ప్రాంతీయ సమగ్రతను తప్పనిసరిగా గౌరవించాలని బీజింగ్ ఒక ప్రకటనలో పేర్కొంది.

## వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించిన కవిత

ప్రభుత్వం తరఫున వారికి వైద్య సహాయం కూడా అందడం లేదని విమర్శించారు. అనంతరం కార్యకర్తలు, బాధితులతో కలిసి జెడ్పీ కూడలిలో ఆందోళనకు దిగారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జెడ్పీ కూడలిలో రోడ్డుపై బైఠాయించారు. దీనితో రోడ్డుపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు జోక్యం చేసుకుని, సర్ది చెప్పడంతో కవిత నిరసన విరమించారు.

## ఏపీ మద్యం కుంభకోణం కేసు.. ఈడీ దర్యాప్తు ముమ్మరం

ఈడీ విచారణకు హాజరైన ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, వెంకటేశ్ నాయుడు, చాణక్య

రెండు గంటల విచారణ తర్వాత వెళ్లిపోయిన ధనుంజయరెడ్డి

నగదు రూపంలో లావాదేవీలపై ఈడీ అధికారుల ప్రశ్నలు

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో విచారణను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముమ్మరం చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న కె.ధనుంజయరెడ్డి , కృష్ణమోహన్‌రెడ్డి, వెంకటేశ్ నాయుడు, చాణక్య ఈరోజు ఈడీ విచారణకు హాజరయ్యారు. రెండు గంటల విచారణ తర్వాత కృష్ణమోహన్‌రెడ్డి వెళ్లిపోగా... ఇతర నిందితులను అధికారులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం పాలసీని ఎలా రూపొందించారు? కేవలం నగదు రూపంలోనే లావాదేవీలు ఎందుకు నిర్వహించారు? అనే అంశాలపై ఈడీ అధికారులు ఆరా తీశారు. ముఖ్యంగా పాప్యులర్ బ్రాండ్లను కాదని, కొత్త బ్రాండ్లకు అనుమతులు ఇవ్వడం వెనుక ఉన్న కారణాలపై సమాచారాన్ని రాబట్టేందుకు ఈడీ అధికారులు ప్రయత్నించారు.. ఈ కుంభకోణం వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 4,000 కోట్ల నష్టం వాటిల్లిందని ఈడీ ప్రాథమికంగా అంచనా వేసింది. అక్రమ సొమ్మును షెల్ కంపెనీల ద్వారా మళ్లించి, తిరిగి నిందితుల ఖాతాల్లోకి చేరేలా ప్రణాళిక రచించినట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే ఈ కేసులో నిందితులైన రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డి, చాణక్యలకు చెందిన రూ. 441 కోట్లకు పైగా విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది.

## క్యూఆర్ కోడ్ తో కొత్త పాసు పుస్తకాలు ఎవరు తప్పు చేసినా వెంటనే తెలుస్తోంది

మొదటి పేజ తరువాయి

గత ప్రభుత్వం ట్రూఅప్ పేరుతో ప్రజలపై భారం మోపిందన్న చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో కరెంట్ ఛార్జీలు పెంచమని పరిస్థితులు అనుకూలిస్తే తగ్గించే ప్రయత్నం చేస్తామని ప్రజలకు చంద్రబాబు హామీ ఇచ్చారు. రాయలసీమను రతనాల సీమగా మార్చి, ఉద్యానవనంగా చేసి చూపిస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. ఇక్కడి ఉత్పత్తులకు ప్రపంచస్థాయిలో మార్కెట్ కల్పిస్తామని హామీ ఇచ్చారు.

**క్యూఆర్ కోడ్ తో కొత్త పాసుపుస్తకాలు - ఎవరు తప్పు చేసినా వెంటనే తెలుస్తోంది: సీఎం చంద్రబాబు**

'గత ప్రభుత్వ హయాంలో మద్యాన్ని కల్తీ చేసి వేల మందిని పొట్టన పెట్టుకున్నారు. పేదవాడి ఆరోగ్యం కంటే వాళ్లకు డబ్బులే ముఖ్యమా? తిరుమల ప్రసాదాన్ని కూడా కల్తీ చేశారు. తిరుమల పవిత్రతను దెబ్బతీయాలని చూశారు. వేంకటేశ్వరస్వామిని అపవిత్రం చేయాలని చూస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించను. ఇతర మతాల సంప్రదాయాలను కాపాడతాం. కుట్రపూరితంగా మత విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తే ఊరుకునేది లేదు. ప్రజల జీవితాలు, ఆరోగ్యంతో ఆడుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో అంతా కల్తీ కుంభకోణాలే. ముఠాలు వద్దు గ్రామాల ప్రశాంతతే ముద్దు అని అందర్నీ కలిపా. రౌడీయిజం, ముఠా కక్షలు లేకుండా చేశాం. రాయలసీమను రతనాల సీమగా మారుస్తా. ఉద్యానవనంగా చేసి చూపిస్తాం. ఇక్కడి ఉత్పత్తులకు ప్రపంచస్థాయిలో మార్కెట్ కల్పిస్తాం.' –చంద్రబాబు, ముఖ్యమంత్రి

ఆనాడు ఐటీ యుగం, ఇవాళ ఏఐ యుగం: ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తెలుగువాళ్లు ఉంటారని, నాడు ఐటీని అభివృద్ధి చేయడం వల్ల చాలామందికి ప్రయోజనం చేకూరిందని సీఎం అన్నారు. ఆనాడు ఐటీ యుగం, ఇవాళ ఏఐ యుగం అని చంద్రబాబు వివరించారు. ఏపీకి పెట్టుబడులు భారీగా వస్తున్నాయని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. జనాభా ఉంటేనే ఏదైనా: దేశంలో ఇదివరకు పెద్ద కుటుంబాలు ఉండేవని, దాన్నే ఆస్తిగా భావించేవాళ్లని సీఎం అన్నారు. ఇప్పుడు కుటుంబాలు కుచించుకుపోయాయని గతంలో తానూ కుటుంబ నియంత్రణను ప్రోత్సహించానని ఆయన తెలిపారు. కానీ ఇప్పుడు కాలం మారిందని, పరిస్థితులు మారాయని జనాభా ఉంటేనే ఏదైనా ఉపయోగించుకునేందుకు వీలుంటుందని సీఎం వెల్లడించారు.

## వసంతం మాయం – మార్చిలోనే మండుతున్న ఎండలు

మొదటి పేజ తరువాయి

అమరావతి : ఒకప్పుడు ఫాల్గుణ మాసం రాగానే ప్రకృతి పులకరించిపోయేది. ఆకులు రాల్చిన చెట్లు కొత్తగా చిగురు తొడిగేవి. కోకిల గానంతో వసంత రుతువు ఆహ్వానం పలికేది. పగలు వెచ్చగా, రాత్రి చల్లగా వాతావరణం ఎంతో ఆహ్లాదభరితంగా ఉండేది. ముఖ్యంగా మార్చి, ఏప్రిల్ నెలలు అంటేనే వసంతానికి కేరాఫ్ అడ్రస్. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వసంతం రాక ముందే వేసవి మంటలు మొదలయ్యాయి. మార్చి నెల ప్రారంభం కాకముందే ఎండలు మండిపోతున్నాయి. అసలు వసంత రుతువు ఉందా లేదా అనే అనుమానం కలుగుతోంది. వాతావరణంలో వస్తున్న అనూహ్య మార్పుల వల్లే ఈ పరిస్థితి దాపురించిందని, భవిష్యత్తులో వేడి తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. కనుమరుగవుతున్న వసంత రుతువు : కొన్నేళ్లుగా మార్చిలోనే వేసవి తరహా ఎండలు దంచికొడుతున్నాయి. గడిచిన రెండేళ్లుగా అయితే వసంత రుతువు వచ్చినట్లు కూడా ఎవరికీ తెలియడం లేదు. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతున్న అనూహ్య వాతావరణ పరిస్థితులు దీనికి ప్రధాన కారణం. దీని ప్రభావంతో దేశవ్యాప్తంగా పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోతున్నాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లోనే పలు ప్రాంతాల్లో వడగాలులు వీయడం ఇప్పుడు సర్వసాధారణంగా మారిపోయింది. తీవ్రమైన పట్టణీకరణ, కాంక్రీట్ జంగిల్స్ పెరగడం, పచ్చదనం తగ్గిపోవడం ఈ ముప్పును మరింత పెంచుతున్నాయి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి : దేశంలో ఈ ఏడాది ఫిబ్రవరి నెలలోనే సగటు ఉష్ణోగ్రతలు 1.07 డిగ్రీలు పెరిగాయి. దక్షిణ భారతదేశంలో పరిస్థితి కొంచెం మెరుగ్గా ఉన్నా, మిగతా ప్రాంతాల్లో ఎండలు రికార్డు స్థాయిలో మండుతున్నాయి. మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అప్పుడే ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలు దాటేశాయి. ఇటీవల కర్నూలులో గరిష్ఠంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ముఖ్యంగా కోస్తా ప్రాంతాల్లో పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉంది. ఇక్కడ ఎండ వేడికి సముద్రపు తేమ కూడా తోడవుతోంది. దీంతో ఉష్ణోగ్రత 32 డిగ్రీలే ఉన్నా, ప్రజలకు మాత్రం 35 డిగ్రీల ఎండలో ఉన్నంత ఉక్కపోత, అసౌకర్యం కలుగుతోంది. మూగజీవాలు, కూలీలపై తీవ్ర ప్రభావం : రాష్ట్రంలో ఈ నెలలోనే వడగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఇప్పటికే ప్రకటించింది. అయితే వడగాలుల కంటే ముందు 'హీట్ స్ట్రెస్' ప్రభావం తీవ్రంగా ఉంటుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల మనుషుల్లో వేగంగా అలసిపోయి, పనిచేసే శక్తి సన్నగిల్లుతుంది. ఉష్ణోగ్రత 32 డిగ్రీలు దాటితే మూగజీవాలు విలవిల్లాడుతాయి. కోళ్లు, మేకలు, గొర్రెలు తీవ్ర ఇబ్బంది పడతాయి. పశువులపై ఈ వేడి ప్రభావం పడి, పాల ఉత్పత్తి కూడా భారీగా తగ్గిపోతుందని పరిశోధనలు చెబుతున్నాయి. ఆరుబయట ఎండలో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, డెలివరీ బాయ్స్ (గిగ్ వర్కర్లు) తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. దీనివల్ల ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల



జీవనాధారంపై, ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం పడుతుంది. "ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం వడగాలులనే కాకుండా, 'హీట్ స్ట్రెస్' ప్రభావాన్ని కూడా మనం తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వాలు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. మైదాన ప్రాంతాల్లోనే కాదు, ఇప్పుడు పర్వత ప్రాంతాల్లోనూ వేడి తీవ్రంగా పెరుగుతోంది. భూతాపం (గ్లోబల్ వార్మింగ్) కారణంగా వాతావరణంలో శరవేగంగా మార్పులు జరుగుతున్నాయి. ఈ మార్పులను తట్టుకునేందుకు ప్రతి ఒక్కరూ మానసికంగా, శారీరకంగా సన్నద్ధం కావాలి. ఒకే ఉష్ణోగ్రత, ఒక్కో భౌగోళిక ప్రాంతంలో వేర్వేరు రకాల ప్రభావాలను చూపిస్తుంది. వాతావరణ మార్పులపై ప్రభుత్వం ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలి.

## నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు

మొదటి పేజ తరువాయి

కేరళ రాష్ట్రాల్లో ఎన్నికల సన్నాహకాలను ఎన్నికల కమిషన్ పరిశీలించింది. ఇప్పుడు బంగాల్ సమీక్ష అనంతరం షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే ఆ నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ కాలపరిమితులు కూడా ముగింపుకు చేరుకుంటున్నాయి. అసోం అసెంబ్లీ గడువు మే 20న ముగియనుంది. కేరళ అసెంబ్లీ కాలపరిమితి మే 23న ముగుస్తుంది. తమిళనాడు అసెంబ్లీ గడువు మే 10న ముగియనుండగా, బంగాల్ అసెంబ్లీ కాలపరిమితి మే 7న ముగియనుంది. అలాగే కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో కూడా ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికల్లో పారదర్శకతను మరింత పెంచేందుకు ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది.

### ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు!

అన్ని పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ అమలు చేయాలని నిర్ణయించింది. ఎన్నికల సమయంలో జరిగే ప్రక్రియను ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు ఆ విధానం ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో జరిగే



ఓటింగ్ ప్రక్రియను ఎన్నికల అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించగలుగుతారు. రిటర్నింగ్ ఆఫీసర్ , జిల్లా ఎన్నికల అధికారి (ఐజూ), రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. దీంతో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడగలుగుతామని అధికారులు చెబుతున్నారు. ఇంతకుముందు అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ విధానం అమలు చేసిన రాష్ట్రంగా బిహార్ నిలిచింది. గత ఏడాది చివర్లో అక్కడ జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ అమలు చేశారు. అంతకు ముందు వరకు కీలక పోలింగ్ కేంద్రాలతో పాటు మొత్తం పోలింగ్ కేంద్రాల్లో 50 శాతం వరకు మాత్రమే వెబ్‌కాస్టింగ్ తప్పనిసరి ఉండేది. ఇక ఎన్నికల షెడ్యూల్ ఖరారు చేసే సమయంలో స్థానిక పండుగలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘాన్ని కోరాయి. ముఖ్యంగా అస్సాంలో జరిగిన సమావేశంలో పలువురు రాజకీయ పార్టీలు ఎన్నికలను ఒక దశలో లేదా గరిష్ఠంగా రెండు దశల్లో నిర్వహించాలని సూచించినట్లు సమాచారం.

### ఓటర్లను చురుకుగా!

అసోం త్వరలో జరగబోయే బిహు పండుగను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల తేదీలను నిర్ణయించాలని పార్టీలు అభిప్రాయం వ్యక్తం చేశాయి. ఈ సూచనలను ఎన్నికల సంఘం గమనించిందని వర్గాలు తెలిపాయి. ఇక ఓటర్ల పాల్గొనికను పెంచేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలెక్టోరల్ పార్టిసిపేషన్ కార్యక్రమం ద్వారా ఓటర్లలో అవగాహన కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాల ద్వారా ఓటర్లను చురుకుగా ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని ఎన్నికల సంఘం లక్ష్యంగా పెట్టుకుంది.

## భారతీయుల భద్రత మా ప్రాధాన్యం'- విపక్షాల నినాదాల మధ్యే పశ్చిమాసియా ఉద్రిక్తతలపై జైశంకర్ వివరణ

మొదటి పేజ తరువాయి

అటు వాయిదా తర్వాత ప్రారంభమైన లోక్ సభలోనూ జైశంకర్ మాట్లాడారు. పశ్చిమాసియా ప్రాంతాల్లో నివసిస్తున్న భారతీయుల సంక్షేమం, భద్రత ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.

'భారతీయులకు వెనక్కి రప్పించేందుకు ప్రయత్నిస్తున్నాం'

పశ్చిమాసియాలో చిక్కుకున్న భారతీయులను వెనక్కి రప్పించేందుకు భారత్ అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని విదేశాంగ మంత్రి జైశంకర్ తెలిపారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న సుమారు కోటి మంది భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు. ఇప్పటికే 67 వేల మంది భారతీయులు స్వదేశానికి తిరుగుపయనమైనట్టు వెల్లడించారు. పశ్చిమాసియాలో పరిస్థితులపై పార్లమెంట్ ఉభయ సభల్లో జైశంకర్ ప్రకటన చేశారు.

ఉద్రిక్తతలపై ముందుగానే భారత్ ఆందోళన

పశ్చిమాసియా ఉద్రిక్తతలు పెరిగే అవకాశంపై భారత్ ముందుగానే ఆందోళన వ్యక్తం చేసినట్లు జైశంకర్ తెలిపారు. ఫిబ్రవరి 20న ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసి, అన్ని పక్షాలు సహనంతో వ్యవహరించాలని కోరిందని చెప్పారు. యుద్ధ పరిస్థితుల తీవ్రతను ప్రస్తావిస్తూ, 2026 ఫిబ్రవరి 28న భారత్ అధికారికంగా ఆందోళన వ్యక్తం చేసినట్లు జైశంకర్ తెలిపారు. ప్రాంతంలో పెరుగుతున్న ప్రాణనష్టం, అలాగే ఇరాన్ నాయకత్వంలో ఏర్పడిన సంక్షోభం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చిందని ఆయన పేర్కొన్నారు.

ప్రతిపక్ష వాక్‌అవుట్‌పై నడ్డా విమర్శలు

జైశంకర్ రాజ్యసభలో ప్రకటన చేస్తుండగా ప్రతిపక్షాలు వాకౌట్ చేయడంపై కేంద్ర మంత్రి జేపీ నడ్డా తీవ్రంగా విమర్శించారు. ప్రకటన చేస్తున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు గందరగోళం సృష్టించి వాక్‌అవుట్ చేయడం బాధ్యతారాహిత్యమని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలు దేశ ప్రయోజనాల కంటే అశాంతి సృష్టించడానికే ప్రయత్నిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. వివిధ చర్చల సమయంలో మంత్రులు సమాధానాలు ఇస్తున్నప్పుడు కూడా తరచుగా వాక్‌అవుట్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

## ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఖమేనికి కంగ్రాట్స్ చెప్పిన పుతిన్.. ఇరాన్‌కు అండగా ఉంటామని హామీ

ఎశ్రీఖఎఅఎఅతీ ౹ాబ్అఅ : ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా ఎన్నికైన అయతొల్లా మొజ్తాబా ఖమేనికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అభినందనలు తెలిపారు. ఇరాన్‌కు మద్దతుగా ఉంటామని పుతిన్ హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం పుతిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎన్నికైన మొజ్తాబాకు శు భాకాంక్షలు. ఈ క్లిష్ట సమయంలో ఇరాన్‌కు రష్యా అండగా నిలబడుతుంది. ఇరాన్‌లోని మా స్నేహితులకు, వారి సమగ్రతకు రష్యా మద్దతుగా ఉంటుంది. మొజ్తాబా తన తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఇరాన్ ప్రజల్ని ఏకతాటిపైకి తెస్తారని భావిస్తున్నాం. యుద్ధం కొనసాగుతున్న ఈ సమయంలో నాయకత్వం వహించడానికి మొజ్తాబాకు గొప్ప ధైర్యం, పట్టుదల కావాలి" అని పుతిన్ తన సందేశంలో పేర్కొన్నారు. ఒకవైపు మొజ్తాబా ఎన్నికపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే, రష్యా మాత్రం మద్దతుగా నిలవడం విశేషం. ఈ యుద్ధ సమయంలో ఇరాన్‌కు రష్యా నైతిక మద్దతు ప్రకటించింది. ఇటీవలే ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్తో పుతిన్ ఫోన్లో మాట్లాడారు. దాడుల్లో మరణించిన ఖమేనీ,



అతడి కుటుంబ సభ్యులు, ఇరాన్ ప్రజలు, సైనికులకు పుతిన్ సంతాపం తెలిపారు. దీనికి మసౌద్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. తాజాగా ఇరాన్ సుప్రీం లీడర్‌గా మొజ్తాబాను అక్కడి అసెంబ్లీ ఎన్నుకున్న సంగతి తెలిసిందే. 1969లో జన్మించిన మొజ్తాబా ఇరాన్‌లోనే మత గురువుల వద్ద విద్యనభ్యసించారు. తాజాగా ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో మొజ్తాబా తండ్రి, ఇరాన్ సుప్రీం లీడర్ అయిన అయతొల్లా ఖమేని, తల్లి, అతడి భార్య కూడా మరణించారు. మొజ్తాబా ఎన్నికతో అతడి మద్దతుదారులు ఇరాన్‌లో సంబరాలు చేసుకుంటున్నారు. కాగా.. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంలో ఇరాన్‌కు రష్యా ఇంటెలిజెన్స్ సహకరిస్తోందనే ఆరోపణలున్నాయి. దీనిపై అమెరికా కూడా ఆరోపణలు చేసింది.

# సంపాదకీయం

## దకనీ సంస్కృతికి నిలువెత్తు రూపం

చేతనగల రచయిత్రికి నిబద్ధత తోడైతే ఆ కలం పేరే జీలానీ బానూ! తెలుగువారితో మమేకమైన అరుదైన ఉర్దూ రచయిత్రి. అస్వస్థత కారణంగా ఇటీవల కన్ను మూశారు. హైదరాబాద్ దకన్ నుంచి ఇక్బాల్ మతీన్, ఎవజ్ సయీద్, బేగ్ ఎహ్సాస్, జీనత్ సాజిదా, కమర్ జమాలీ, నజ్మా నిక్‌హత్ వంటి అగ్రశ్రేణి కథకులు ఉన్నప్పటికీ... వీరెవరూ తమ రచనలలో హైదరాబాద్ మిశ్రమ సంస్కృతికీ, దకనీ తెహ్‌జీబ్‌కూ చెప్పుకోదగ్గ ప్రాధాన్యమిచ్చినట్లుగా కనిపించదు. అయితే, హైదరాబాద్‌లో జన్మించకపోయినా, జీలానీ బానూ తన రచనలలో తెలంగాణ గ్రామీణ జీవనాన్ని, ఇక్కడి సంస్కృతీసంప్రదాయాలను చిత్రించారు. దకనీ నుడికారానికి గుడి కట్టారు. పీడితుల బాధలూ, గాథలే ఆమె కథావస్తువులయ్యాయి. అందుకే తెలుగు సమాజంపై ఆమె తనదైన చెరగని ముద్ర వేశారు. 90 ఏళ్ళ క్రితం యూపీలోని బదాయూఁలో సంప్రదాయ ముస్లిం కుటుంబంలో జన్మించిన జీలానీ బానూ ఐదారేళ్ళ ప్రాయంలోనే తండ్రి హైరత్ బదాయూనీతో కలిసి హైదరాబాద్ వచ్చేశారు. ప్రసిద్ధ ఉర్దూ, అరబిక్, ఫార్సీ కవిపండితుడైన హైరత్, నిజాం సర్కారులో కొలువులో చేరి మల్లేపల్లిలో స్థిరపడ్డారు. వారింటికి ఫానీ బదాయూనీ, జోష్ మలిహాబాదీ, జిగర్ మురాదాబాదీ, హస్రత్ మొహానీ, మఖ్దూం మొహియుద్దీన్, మజ్రూహ్ సుల్తాన్‌పురీ, కైఫీ ఆజ్మీ, షకీల్ బదాయూనీ, అలీ సర్దార్ జాఫ్రీ వంటి దిగ్గజ షాయర్లు తరచుగా వారి ఇంటికి వచ్చేవారు. సాహిత్య గోష్ఠులతో నిత్యం వారి ఇల్లు సందడిగా ఉండేది. అట్లాంటి సారస్వత వాతావరణంలో పెరిగిన బానూకు రచనా వ్యాసంగం పట్ల మక్కువ ఏర్పడడంలో ఆశ్చర్యం ఏముంది? బానూ రచనలు ఇండియాలో కన్నా ముందు పాకిస్తాన్‌లో ప్రచురితమయ్యేవి. ఆమెకు అక్కడ విశేష పాఠకాదరణ ఉంది. మోసపోయిన ఒక అమ్మాయి విషాదాంతంపై బానూ రాసిన తొలి కథ 'మోమ్ కీ మరియం'ను లాహోర్‌లోని ప్రసిద్ధ సాహిత్య మ్యాగజీన్ 'అదబే లతీఫ్' ప్రచురించింది. 19551992 మధ్య రాసిన 67 కథలను 'తిర్యాక్' పేరుతో పాక్ లోని మక్తబ దానియాల్ ప్రచురణ సంస్థ సంకలనంగా తెచ్చింది. అనేక కథా సంపుటాలు పాకిస్తాన్ నుంచి వెలువడ్డాయి. జీలానీ బానూ మొత్తం 22 పుస్తకాలు రాయగా, వాటిలో రెండు నవలలు, ఏడు కథా సంపుటాలు, రెండు నవలికలు ('జుగ్నూ ఔర్ సితారే', 'నగ్మే కా సఫర్'), కిషన్ చందర్‌పై మోనోగ్రాఫ్, రేడియో నాటికలు, నాటకాలు, బాలల కథలు ముఖ్యమైనవి. 'ఐవానే గజల్', 'బారిషే సంగ్' నవలలు ఆమెకు ఎంతో కీర్తిప్రతిష్ఠలు తీసుకొచ్చాయి. స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాత నిజాం హయాంలో పరిణామాలు, అనంతరం ప్రజాప్రభుత్వం ఏర్పడేలోగా సంధి దశలో జరిగిన జాగీర్దార్ల అరాచకాలు, మార్పుల నేపథ్యంలో రాసిన నవలే 'ఐవానే గజల్'. ఇది అనేక భారతీయ, విదేశీ భాషలతోపాటు మొత్తం 14 భాషలలో అనువాదమయ్యింది. 195070 మధ్య కాలంలో తెలంగాణ పల్లెల్లో పేదలు, కూలీలపై జమీందార్లు, పెత్తందార్లు సాగించిన దాష్టీకాలకు అద్దంపడుతూ, నాటి వెట్టి వ్యవస్థను ఎండగట్టిన నవలే 'బారిషే సంగ్'! ఆమె రాసిన 'నర్సయ్య కీ బావ్డీ' కథను ప్రముఖ దర్శకుడు శ్యామ్ బెనెగల్ 'వెల్‌డన్ అబ్బా' పేరుతో తెరకెక్కించారు. ముస్లిం సంప్రదాయ కుటుంబంలో పుట్టినప్పటికీ, బానూ పర్దా చాటునే ఉండిపోలేదు. చిన్ననాటే కిషన్‌చందర్, రాజేందర్ సింగ్ బేదీ, మంటో, ఇస్మత్ చుగ్తాయీ, ఫైజ్ రచనల ప్రభావానికి లోనైనప్పటికీ ఆమె సొంత గొంతు వెతుక్కున్నారు. అంజుమన్ తరక్కీ పసంద్ ముసన్నఫీన్ (అ.ర.సం)లో చేరకపోయినా, దాని లోని సాహితీవేత్తలతో ఆమెకు సత్సంబంధాలు ఉండేవి. సైద్ధాంతిక పెతలాటకం ఆమె రచనా వ్యాసంగానికి ఆటంకం కాలేదు. దౌర్జన్యాలూ, అన్యాయాలూ జరిగితే ఆమె కలం ఎప్పుడూ బాధితుల పక్షమే రాసేది. గృహహింస అయినా, ఆఫీసులో ఉద్యోగినికి వేధింపులైనా, రాజ్యహింస జరిగినా, కార్మికులు, రైతుల కడగండ్లయినా బానూ పీడితుల పక్షానే వున్నారు. ఉరిశిక్షను నిరసిస్తూ, భ్రూణహత్యలను ఖండిస్తూ కథలు రాశారు. ఏది రాసినా నిబద్ధతతో, నిర్భయంగా రాశారు. బానూ రచనలలో కథ ఎత్తుగడ, కథనం, సంభాషణలకు దకనీ భాష, శిల్పం ప్రధానంగా కనిపిస్తాయి. తొలి వాక్యంతో పాఠకుడి మెదడులోకి బోలెడన్ని ప్రశ్నలు సంధిస్తారు. ఆ వాక్యమే కడదాకా చదివిస్తుంది. "చత్వారం కళ్ళజోడు నెంబరు మారిందా? లేక ప్రపంచమే మారిపోయిందా?" అంటూ ఒక వాక్యంతో 'అపరాధి' కథ మొదలవుతుంది. బానూ సృజించినన్ని తెలుగు పాత్రలు బహుశా, హైదరాబాద్‌లోని ఏ ఉర్దూ కథకుడూ సృష్టించి ఉండరు. మిశ్రమ సంస్కృతి భావనకు ఇతర రచయితలు అంతగా ప్రాధాన్యమివ్వలేదు. ఆమె నవలలు, కథలలో మల్లేశం, రవి, పోచమ్మ, నర్సయ్య, బాలయ్య, సత్యనారాయణ... ఇలా ఎందరో ఉంటారు. ఆమె రచనలలో హిందూ దేవుళ్ళ శ్లోకాలు, బోనాల సంబరాలు, దీపావళి వెలుగులు తళుక్కుమంటాయి. పఠనీయతను పెంచే ఆమె రచనా శైలిని తెలుగువారు ఇష్టపడతారు.

# చూచిరాతల చదువులు మరి!



దిల్లీలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ ఏఐ సదస్సులో గల్గోటియాస్ విశ్వవిద్యాలయం చైనా తయారీ రోబో శునకాన్నీ, దక్షిణ కొరియాలో తయారైన సాకర్ ఆడే డ్రోన్‌నూ తానే తయారు చేసినట్లు గొప్పగా ప్రదర్శించి దొరికిపోయింది! ఇలాంటివి గల్గోటియాస్‌కు కొత్తేమీ కాదు. కొవిడ్ కాలంలో అన్నం పళ్లెం లేదా గంట మోగించడం వల్ల వచ్చే శబ్దతరంగాలు కరోనా వైరస్‌ను నశింపజేస్తాయంటూ పరిశోధన పత్రాన్ని వెలువరించింది. ఒక ప్రముఖ జర్నల్‌లో అది ప్రచురితమవడం ఎంతో నగుబాటుకూ, హేళనలకూ గురైంది. ఇలాంటి ఉదంతాలు భారత విద్యావ్యవస్థను పట్టిపీడిస్తున్న అవలక్షణాలకు సంకేతాలు! భారతీయ విద్యావ్యవస్థ- ఉన్నత స్థాయిలోనూ విద్యార్థులతో బట్టీ పట్టించడానికే ప్రాధాన్యమిస్తోంది. కార్యకారణ సంబంధాల గురించి తర్కించి, మూలాల్లోకి వెళ్లే విమర్శనాత్మక మనస్తత్వం నుంచే సృజనాత్మకత పుడుతుంది. విద్యార్థుల్లో ఇలా నవకల్పనలను సాధించాలన్న తపనను పుట్టించడానికి మన విద్యావ్యవస్థ ప్రయత్నించడం లేదు. తరగతి గదిలో విద్యార్థులు ప్రశ్నలు వేస్తే కొందరు అధ్యాపకులు చిరాకు పడుతుంటారు. పరీక్షలో పాసవ్వడానికి కొన్ని మూస పద్ధతులను వారిపై రుద్దుతుంటారు. అందుకనే, విద్య పరమార్థం సృజనాత్మకతను పెంపొందించుకోవడం కాదనీ, ఎలాగోలా పరీక్షల్లో ఉత్తీర్ణులం కావడమేననే భావన మనలో జీర్ణించుకుపోయింది. ఉన్నత స్థాయి కోర్సుల్లో విద్యార్థులను చేర్చుకుంటున్న కొన్ని సంస్థలు- అసలు తరగతులే నిర్వహించట్లేదు. విద్యార్థులు కేవలం పరీక్షలకు హాజరైతే చాలంటున్నాయంటే ఏమనుకోవాలి అందునా పరీక్షల్లో కాపీ కొట్టడం ఆనవాయితీగా, పెద్ద వ్యాపారంగా మారిపోయిందిప్పుడు!

### పాఠశాల స్థాయిలోనే అవినీతి బీజాలు...

కొన్ని రాష్ట్రాల బోర్డు పరీక్షల్లో టెన్త్, ఇంటర్ విద్యార్థులు అయిదు వేల రూపాయలిస్తే చాలు, ఎవరైనా నల్లబోర్డు మీద ప్రశ్నపత్రానికి జవాబులు రాసిపెడతారని అంటారు. వాటిని ఎంచక్కా కాపీకొట్టి పరీక్షలో పాస్ కావచ్చు. సరిగ్గా చదవలేని, రాయలేని విద్యార్థులు రెట్టింపు రుసుము చెల్లిస్తే... వారి తరఫున జవాబులు రాసిపెట్టేవారూ సిద్ధంగా ఉంటారు. ఇలా మూకుమ్మడిగా కాపీ కొట్టే కార్యక్రమాన్ని ఆయా రాష్ట్రాలు అస్సలు పట్టించుకోవడమే లేదు. కొందరు అవినీతి అధికారుల నుంచి తమకు ముట్టాల్సింది ముడుతుంది కాబట్టి, నాయకులూ కిమ్మనరు. ప్రాథమిక విద్యాశాఖకు చెందిన కొందరు బ్లాక్‌స్థాయి అధికారుల నుంచి కొంతమంది శాసనసభ్యులకు నెలనెలా మామూళ్లు ముడుతున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ కాపీకొట్టే వ్యవహారం హైస్కూళ్లు, కళాశాలల్లోనే కాదు, ప్రతిష్ఠాత్మక ఇంజినీరింగ్, వైద్యవిద్య ప్రవేశ పరీక్షల్లోనూ జరుగుతోంది. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల విద్యార్థులే ఆశావహ అభ్యర్థుల తరఫున పరీక్ష రాసిపెడుతూ బాగా డబ్బులు సంపాదిస్తున్నారు. కొన్ని కోచింగ్ సెంటర్లూ ఇందులో భాగమవుతున్నాయి. ఇలా అక్రమ మార్గాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి మనం ఏం ఆశించగలం? అడ్డదారుల్లో చదువు పూర్తిచేసి, లంచాలతో కొలువులు కొట్టేసినవారు... ఉద్యోగంలోనూ అదే పంథాను కొనసాగిస్తూ అవినీతిపరులవుతున్నారు.

చదువుకునే సమయంలోనే అవినీతికి బీజం పడుతున్నప్పుడు- ఇక మన రాజకీయ, పాలనా వ్యవస్థలు అవినీతిమయం కావడంలో ఆశ్చర్యమేముంది? రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు కోరిన విధంగా అంతా బాగున్నట్లు నివేదికలు తయారు చేయడానికీ; వాస్తవాలనూ డేటానూ తారుమారు చేయడానికీ; తప్పును ఒప్పుగా, ఒప్పును తప్పుగా చూపించడానికీ చాలామంది 'విద్యావంతులు' తమ తెలివితేటలను ప్రదర్శిస్తున్నారు. మెరుగైన సమాజ నిర్మాణానికి విద్యను ఎలా ఉపయోగించాలి? విద్యా ప్రమాణాలను ఎలా మెరుగుపరచాలి? అని ఎవరూ లోతుగా పరిశీలించట్లేదు. ఇలాంటి ధోరణుల వల్ల నిజంగా విద్యను నేర్చుకోవడం కన్నా పరీక్షలే ముఖ్యమన్న సందేశం ప్రజల్లోకి వెళ్తోంది. నేర్చుకోవడానికి శ్రమించనవసరం లేదనీ, అడ్డతోవలో పరీక్షలు పాస్ కావచ్చనీ విద్యార్థులూ తల్లిదండ్రులూ భావిస్తున్నప్పుడు ఇక మన విద్యావ్యవస్థను రక్షించేదెవరు? విద్యార్థులు రాసే అసైన్‌మెంట్లలో భావ చౌర్యం ఎంతవరకు ఉండవచ్చో విద్యాసంస్థలే పరిమితులు నిర్ణయించుకోవడం సిగ్గుచేటు కాదా? నేడు కేజీ స్థాయి ప్రాజెక్టులు మొదలు పీహెచ్‌డీ థీసిస్ రాయడం వరకు అన్ని పనులను ఔట్‌సోర్సింగ్ చేయడం సర్వసాధారణమైపోతోంది. పిల్లలకు సక్రమంగా చదువులు చెప్పడంకన్నా, వారు పరీక్షల్లో కాపీ కొడుతున్నారని పట్టుకోవడమే ఘనతగా భావించే అధ్యాపకులూ ఉన్నారు.

### సమూల ప్రక్షాళనతోనే మార్పు...

తన చుట్టూ జరుగుతున్న ఇలాంటి అక్రమాలను చూడబట్టే గల్గోటియాస్ సహాయ ఆచార్యురాలు నేహాసింగ్ చైనీస్ రోబో శునకాన్ని తన విశ్వవిద్యాలయ సృష్టిగా చలామణి చేయాలని చూశారు. ఈ తప్పిదానికి ఆమె ఒక్కరినే బలిపశువును చేసి సరిపెట్టుకోవడం కాదు. దేశంలోని మొత్తం విద్యావ్యవస్థనే ప్రక్షాళించాలి. గల్గోటియాస్ వంటి ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాకాలు చూశాక, సగటు ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రమాణాలు ఇంతకన్నా బాగుంటాయని పొరబడకూడదు. రాజకీయ, పాలనా వ్యవస్థల్లోని అవినీతితో విద్య ప్రైవేటీకరణ జతకలవడం- నాసిరకం, నకిలీ విద్యాసంస్థలు పుట్టుకురావడానికి కారణమైంది. యూజీసీ ఇటీవల 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్న 23 నకిలీ విశ్వవిద్యాలయాల జాబితాను విడుదల చేసింది. వాస్తవంలో ఇలాంటి సంస్థలు ఇంకా ఎక్కువగానే ఉంటాయి. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నిర్వహణాధికారులను మార్చడం ద్వారా పరిస్థితిని కొంతవరకు చక్కదిద్దే వీలుంటుంది. ప్రైవేటు విద్యాసంస్థల్లో పరిస్థితి దిగజారితే ఇక అంతే. అసలు ప్రైవేటు విశ్వవిద్యాలయాల అనుమతులకే పెద్దయెత్తున ముడుపులు ముట్టజెప్పాల్సి ఉంటుందన్న విమర్శలున్నాయి. అంతర్జాతీయ ఏఐ సభలో నాలుగు ఐఐటీలకన్నా ఎక్కువ స్థలాన్ని గల్గోటియాస్ పొందగలిగిందీ అంటే ఏంటి కారణం? రానున్నది ఏఐ యుగం కాబట్టి, ఇక అసలైన మేధస్సు అవసరం పెద్దగా ఉండకపోవచ్చు. కొద్దిమంది నూతన ఆవిష్కరణలు చేస్తే, మిగతావారు వాటిని అనుసరిస్తారు. గల్గోటియాస్ విశ్వవిద్యాలయం చేసిన పని ఇదే. అక్రమార్కులకు ఇదే వాటంగా ఉంటుంది కాబట్టి, వ్యవస్థ ఇలాగే కొనసాగే ప్రమాదం పొంచి ఉంది!

# చరిత్ర మిగిల్చిన కన్నీటి గాథ.. అగమ్య గమ్యాలు




నిరంతర పరిశోధకుడు, సుప్రసిద్ధ అనువాదకుడు, కవి, రచయిత అయిన ముకుంద రామారావు రచించగా, ప్రముఖ విమర్శకుడు ఏ.కే. ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువరించిన మానవీయ పరిశోధనా గ్రంథం ఇది. ఈ పుస్తకం చదువుతూంటే గుండెను పిండే ఆవేదన మనల్ని ఆవహిస్తుంది. మనకు ఇంతవరకూ తెలిసిన కొలబద్దలూ, గీటురాళ్లూ, ప్రమాణాలూ తుడిచిపెట్టుకు పోతాయి.

కర్మల మధురపు సందేశం.. అమలోద్భవిలో అర్జునుడు!

సమాచారం నిరంతర తరంగాలుగా తాకి, మన నేల క్రింది భూమిని తొలుస్తుంది. ఈ సమీక్షకుడికి పదేపదే గుర్తుకువచ్చిన కవిత – శ్రీ శ్రీ 'దేశచరిత్రలు'. ముఖ్యంగా – ఈ రెండు పంక్తులు: గతమంతా తడిసె రక్తమున, కాకుంటె కన్నీళులతోడ పరిశోధనా గ్రంథం చదువుతూ, తటస్థంగా, పొడిపొడిగా ఉండే అకాడమిక్ ప్రపంచానికి పరిమితం కాకుండా పునాదులు కదిలిపోవడం, ఉద్విగ్నతకు లోను కావడం, తడిగా తాకే కవిత్వాన్ని ప్రస్తావించడం – ఇదంతా ఏమిటనే సందేహం పాఠకులకు కలగవచ్చు. ఆ సందేహానికి సమాధానం ఈ సమీక్ష.

### మనం కోల్పోయిన.. సంప్రదాయ ధార!

### బానిసల స్థానంలో ఒప్పంద శ్రామికులు..

1834లో బానిస వ్యవస్థ రద్దయ్యాక కూడా వ్యవసాయ రంగంలో పనిచేయగల శ్రామికుల అవసరం కొనసాగింది. నిజానికది పెరిగిపోయింది. అప్పటికే వలసలు ప్రపంచమంతటా విస్తరించి, సామ్రాజ్యవాద దేశాల పాలనలో సుస్థిరంగా ఉన్నాయి. శీతల దేశాలకు చెందిన యజమానులు విస్తారమైన ఉష్ణ ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. పంచదార, టీ, కాఫీ, పత్తి, రబ్బరు వంటి ఉష్ణ ప్రాంతాలు ఉత్పత్తులు 'నాగరిక' దేశాల్లో మంచి ధరలు పలుకుతున్నాయి. అప్పనంగా లభించిన లక్షలాది ఎకరాల భూమి విదేశీ పాలకుల ఆధీనంలో ఉంది. మరోవైపు వ్యవసాయక ఉత్పత్తులకు విశేషమైన గిరాకీ ఏర్పడింది. పంటలను రాబట్టగల శ్రామికులు కావాలి. 'దురదృష్టవశాత్తూ' వివిధ చారిత్రక పరిణామాల ఫలితంగా బానిస వ్యవస్థ రద్దయిపోయింది. అప్పుడేం చెయ్యాలి? వ్యవసాయంలో నైపుణ్యం కలిగిన శ్రామికులు 'స్వచ్ఛందంగా' వ్యవసాయోత్పత్తిలో ప్రవేశించగల ఏర్పాటు చెయ్యాలి. ఈ నేపథ్యంలో 'ఒప్పంద శ్రామిక వ్యవస్థ'ను చట్టబద్ధమూ, వ్యవస్థీకృతమూ చేశారు విదేశీ పాలకులు..

### ప్రలోభాలతో దేశాంతర యానం!

'గిర్మెట్లు' అనే అపభ్రంశం అప్పుడే పుట్టింది. దానికి మూలం 'అగ్రిమెంట్' (ఒప్పందం). భారతదేశపు నలుమూలల నుండి, కరువు బాధితులు, భూమిలేని నిరుపేదలు, గిర్మిట్ లేబర్ మార్కెట్ ప్రధాన వనరుగా, ఎడతెగని ప్రవాహంగా అవతరించారు. నిరక్షరాస్యులైన ఈ అట్టడుగు వర్గాల జనం ఏజెంట్ల ప్రలోభాలకు లొంగి, మోసపోయి, ఎక్కడికి, ఎందుకు తీసుకెళుతున్నారో తెలియకుండానే, ఒప్పందాలపై వేలిముద్రలు వేసి, కూలీ ఓడల్లో, అమానుషమైన పరిస్థితుల్లో, నెలల తరబడి సముద్రయానాలు చేశారు.. అంతవరకూ తమ ఉత్పత్తులను మార్కెట్ ధరలకు అమ్ముకున్న ఆసియా ఖండపు రైతు బిడ్డలు, పూర్తిగా చితికిపోయి, పరాయిదేశాల్లో ఊడిగం చేసే శ్రామికులుగా, కేవలం తమ శ్రమను అమ్ముకొనే నిస్సహాయ సమూహంగా అవతరించారు. అటు భూమి మీద గాని, ఇటు ఉత్పత్తి మీద కాని వారికి ఎటువంటి హక్కూ లేదు.

నిరక్షాస్యులపై అర్థశాస్త్రం గెలుపు..

శ్రమదోపిడీ ఎల్లప్పుడూ నాలుగడుగులు ముందే ఉంటుందని ఒప్పంద శ్రామిక వ్యవస్థ మరోసారి నిరూపించింది. శ్రమ... నిత్యం మారుతూ ఉండే పెట్టుబడి అవసరాలకు స్పందిస్తూ, వ్యవస్థను నమ్ముకొని, వెంట నడుస్తుంది. ఎప్పుడైతే దోపిడీ దుర్భరంగా, క్రూరంగా మారుతుందో, అప్పుడే పోరాటాలు మొదలౌతాయి. శ్రామికులు నష్టపోతారు. ఉత్పత్తి దెబ్బ తింటుంది. సంస్కరణలు తప్పనిసరి అవుతాయి. అవికూడా పెట్టుబడి కనుసన్నలలోనే రూపొంది అమలవుతాయి.

### మూలాలను వెతుక్కొనే అన్వేషణ..

ఈ పరిణామాలన్నింటినీ, సవివరంగా, గణాంకాలతో సహా నమోదుచేసిన సామాజిక చరిత్ర పునాదిగా సాగిన పరిశోధన ఈ రచన. అందుకే ఇది 'దిగువనుండి ఎగువకు', పాలితుల దృక్కోణం నుండి పాలకుల చర్యలను పరిశీలిస్తూ, ఆయా పరిణామాలను విశదీకరిస్తుంది. విశ్లేషిస్తుంది. పైగా దీని వెనుక రచయిత తన మూలాలను వెతుక్కొనే అన్వేషణ ఉన్నది. నిజానికి ముకుంద రామారావు పూర్వీకులు ఒప్పంద శ్రామికులుగా దక్షిణాఫ్రికా వెళ్లిన వాళ్లు. వారిలో కొంతమంది కుటుంబ సభ్యులు అక్కడే స్థిరపడ్డారు.

### అక్షరాల్లో నిస్సహాయుల ఆక్రందనలు..

అందుకే ఈ రచన ఏక కాలంలో రాజకీయ ఆర్థిక శాస్త్ర పరిశోధన, సామాజిక చరిత్ర, ఆత్మకథ, మూలాల అన్వేషణ. అంతేకాదు, ఇది 'శనిదేవత రథచక్రపుటిరుసులలో పడి నలిగిన' నిస్సహాయులు ఆక్రందనలను వారి మాటల్లోనే, పాటల్లోనే, కవితల్లోనే నమోదు చేసే ప్రయత్నం కూడా. స్వయంగా కవి, కవిత్వ పక్షపాతి అయిన ముకుంద రామారావు, ఎంతో శ్రమకోర్చి అలనాటి ఒప్పంద కార్మికులు పాడుకున్న గీతాలను, తరువాతి తరాల్లో చదువుకొనే అవకాశం పొందినవారు ప్రచురించిన కవితలను సేకరించారు. వాటిని అనువదించి ఈ రచనలో విస్తారంగా ప్రస్తావించారు. ఆ ఖండాంతర ప్రకంపనలు మన హృదయాలను తాకుతాయి. ఉదాహరణకి, మారిషస్ కవి తోరాబుల్లీ ఇలా అంటాడు (పే. 106):

### 13 లక్షల మంది ప్రవాస భారతీయులు

ఒప్పంద శ్రామికులుగా వెళ్లిన 13 లక్షలమంది భారతీయులలో అధిక శాతం అక్కడే స్థిరపడిపోయారు. తరువాతి తరాలకు అందిన మెరుగైన జీవనం, చదువు, ఉద్యోగావకాశాలు, భూవసతి, ముఖ్యంగా కులవివక్ష లేకపోవడం వారిని అక్కడే ఉండిపోయేందుకు ప్రోత్సహించాయి. సుమారు ఎనభై ఏళ్లపాటు కొనసాగిన ఒప్పంద శ్రామిక వ్యవస్థ, చరిత్ర మిగిల్చిన కన్నీటి గాథ, స్వేద కాసారం, నెత్తుటి చారిక, సమిష్టి విషాదం. ఖండాలను జోడించే సాగరఘోష ఈ రచన.

### రక్తసిక్త చరిత్రను చదవాల్సిందే!

గాంధీజీ తన సామ్రాజ్య వ్యతిరేక పోరాటాన్ని దక్షిణ ఆఫ్రికాలో మొదలుపెట్టి, భారతదేశంలో కొనసాగించడం యాదృచ్ఛికం కాజాలదని ఈ రచన తెలుపుతుంది. ప్రతీ గ్రంథాలయంలోనూ ఉండాల్సిన, ఇతర భారతీయ భాషల్లోకి, ఇంగ్లీషులోకి అనువదించాల్సిన ప్రామాణిక రచన ఇది. రెండు వందలేళ్ల నాటి ఖండాంతర ప్రవాస భారతీయుల రక్తసిక్త చరిత్రకు ఎంతోకొంత న్యాయం చెయ్యాలంటే ఇటువంటి పరిశోధనాత్మక రచనలు సర్వవ్యాప్తితమై సమస్త జాతులనూ చేరుకోవాల్సి ఉంది. రచయితకి అభినందనలు.

## బంగాల్‌లో 3దశలకు మించకుండా ఎన్నికలు నిర్వహించాలి'

# ఎలక్షన్ కమిషన్ కు రాజకీయ పార్టీల వినతి

కేంద్ర ఎన్నికల సంఘాన్ని అభ్యర్థించిన రాజకీయ పార్టీలు- అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ భద్రతా అంశాలపై బీజేపీ ఆందోళన

2026 : బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలను 3 దశలకు మించకుండా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరాయి రాజకీయ పార్టీలు. జుజ× పూర్తిస్థాయి బెంచ్‌ను కలిసిన పలు పార్టీలకు చెందిన ప్రతినిధుల బృందాలు ఈ మేరకు విజ్ఞప్తి చేశాయి. ఎన్నికల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఈసీని కోరాయి పార్టీలు. ఇందులో టీఎంసీతో పాటు బీజేపీ, సీపీఐ (ఎం), కాంగ్రెస్ , ఆప్ , ఎన్ పీపీ, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు ఉన్నాయి. "రాష్ట్రంలో ఎన్నికలకు సంబంధించిన అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాం. పలు పార్టీలు రాష్ట్రంలో ఒకటి లేదా రెండు దశల్లో ఎన్నికలు నిర్వహించాలని కోరాయి. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఈసీకి సహకరిస్తామని తెలిపాయి. కేంద్ర సాయుధ బలగాలతో పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలి. ఫలితంగా ఓటర్లు ఎలాంటి భయం లేకుండా వారి హక్కును వినియోగించుకుంటారని చెప్పారు" అని ఎన్నికల సంఘం వర్గాలు ప్రకటనలో పేర్కొన్నాయి. క్రూడ్ బాంబులు వినియోగించే అవకాశం ఉందని కొన్ని పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. అక్రమ ఆయుధాలతో పాటు నగదు రవాణను అరికట్టాలని విజ్ఞప్తి చేశాయి. ఈ క్రమంలోనే స్పందించి ఈసీ, ఎన్నికల చట్ట ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చింది. హింసాత్మక ఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు పూర్తి చేస్తామని తెలిపింది. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై స్పందించిన సీఈసీ, ఎస్ ఐఆర్ పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. ఇప్పటికీ ఓటర్ జాబితాలో నమోదు, తొలగింపునకు, సవరణల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

16 పాయింట్లతో కూడిన వినతి పత్రాన్ని ఈసీకి సమర్పించిన బీజేపీ

అంతకుముందు ఈసీని కలిసిన బీజేపీ బంగాల్ ప్రతినిధుల బృందం, అసెంబ్లీ ఎన్నికలకు ముందు బంగాల్‌లో భద్రతా అంశాలపై ఆందోళనలను వ్యక్తం చేసింది. ఈ మేరకు అందుకు సంబంధించి 16 పాయింట్లతో కూడిన వినతి పత్రాన్ని ఈసీకి సమర్పించింది. ఎన్నికల నిర్వహణ 3 దశలకు మించకుండా చూడాలని విజ్ఞప్తి చేసింది. ఎటువంటి అల్లర్లకు తావులేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఈసీని కోరింది. అలాగే సున్నితమైన పోలింగ్ బూత్‌లను గుర్తించే ప్రమాణాలను పునర్నిర్వచించాలని ఈసీని అభ్యర్థించింది. సుమారు 400 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలను ఎన్నికల నిర్వహణకు ఉపయోగించాలని బీజేపీ ప్రతినిధుల బృందం ఈసీని కోరింది. అదే సమయంలో కేంద్ర బలగాలను రాష్ట్ర పోలీసు యంత్రాంగం ఉపయోగించుకుంటున్న తీరుపై అసంతృప్తిగా ఉన్నట్లు పేర్కొంది. ఓటర్లకు భరోసాను ఇవ్వడంలో పోలీసు యంత్రాంగం విఫలమవుతోందని విమర్శించింది. హింస లేని, భయంలేని వాతావరణం ఏర్పడాలంటే ఓటర్లు తమ సొంత ఓట్లు వేయకుండా నిరోధించే పోలీసులు, ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని బీజేపీ కోరింది. ఎన్నికలు ఒకే దశలో నిర్వహించాలని డిమాండ్ చేశాం. ఒకవేళ కాదనుకుంటే రెండు దశలకు మించకూడదని కోరాం. ఎన్నికలు స్వేచ్ఛాయుత, పారదర్శక పద్ధతిలో జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ తర్వాత అర్హులైన ఓటర్లతో కూడిన జాబితాను ప్రచురించాలని డిమాండ్ చేశాం. జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై నెలకొన్న ఆందోళనపై కేంద్ర ఎన్నికల సంఘం పట్టించుకోవడం లేదని

# వరల్డ్ కప్ విక్టరీ మాత్రమే కాదు రికార్డుల సునామీ

# టీమ్ఇండియా సృష్టించిన సంచలనాలు ఇవే!

### కివీస్‌ను చిత్తు చేసి భారత్ రికార్డ్ విక్టరీ- మూడు టీ20 ప్రపంచకప్‌లు గెలిచిన తొలి జట్టుగా రికార్డు- ఒకే ఎడిషన్‌లో అత్యధిక సిక్సర్లతో సరికొత్త వరల్డ్ రికార్డు- వరల్డ్ కప్ హిస్టరీలోనే టాప్ స్కోర్



అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో బ్యాడ్ సెంటిమెంటును బ్రేక్ చేసి టీమ్ఇండియా గర్జించింది. టాస్ ఎవరు గెలిస్తే వారేదే విజయం అనే మాటకు అసలైన జవాబు ఇచ్చింది. అయితే కేవలం టైటిల్ గెలవడమే కాదు, క్రికెట్ చరిత్రలో మున్నెన్నడూ లేని విధంగా రికార్డుల సునామీని సృష్టించింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో భారత జట్టు కివీస్‌ను 96 పరుగుల తేడాతో మట్టికరిపించి, తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఈ గెలుపుతో భారత్ కేవలం ఛాంపియన్‌గా నిలవడమే కాకుండా, గణాంకాల పరంగా ప్రపంచ క్రికెట్‌ను శాసించే స్థాయికి చేరుకుంది. ఒకే మ్యాచ్‌లో ఇన్ని రికార్డులు బద్దలవ్వడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో తిరుగులేని బలాన్ని బయటపెట్టిన భారత్, ఈ టోర్నీ ద్వారా సాధించిన ఆ అరుదైన రికార్డులను సొంతం చేసుకుంది. అవేంటో ఇప్పుడు వివరంగా చూద్దాం.

సిక్సర్ల హోరు

ఈ టోర్నీలో టీమ్ఇండియా బ్యాటర్లు సిక్సర్లతో విరుచుకుపడ్డారు. మొత్తం టోర్నీలో భారత్ ఏకంగా 106 సిక్సర్లు బాదింది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఒకే ఎడిషన్‌లో ఒక జట్టు ఇన్ని సిక్సర్లు బాదడం ఇదే మొదటిసారి. ఫైనల్ మ్యాచులో కూడా భారత్ దూకుడు ఏమాత్రం తగ్గలేదు. పవర్ ప్లేలోనే వికెట్ నష్టపోకుండా 92 పరుగులు చేసి వరల్డ్ కప్ చరిత్రలోనే అత్యధిక పవర్ ప్లే స్కోరును నమోదు చేసింది. ఈ అద్భుతమైన ఆరంభమే భారత్ భారీ స్కోరు సాధించడానికి బలమైన పునాది వేసింది.

వేగవంతమైన స్కోరింగ్- కివీస్ బౌలర్లకు పీడకల బ్యాటింగ్ లో భారత్ మెరుపు వేగంతో పరుగులు రాబట్టింది. కేవలం 4 ఓవర్లలోనే జట్టు యాభై పరుగుల మార్కును చేరుకుని, టీ20 వరల్డ్ కప్ నాకౌట్ మ్యాచులలో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ రికార్డును నెలకొల్పింది. అక్కడితో ఆగకుండా, కేవలం 44 బంతుల్లోనే (7.2 ఓవర్లలో) జట్టు సెంచరీ పూర్తి చేసింది. దీంతో నాకౌట్ మ్యాచులలో వేగవంతమైన వంద పరుగుల రికార్డును కూడా తన ఖాతాలో వేసుకుంది. ఈ టోర్నీలో భారత్ ఏకంగా మూడుసార్లు 250కి పైగా స్కోర్లు సాధించి, ఒకే ఎడిషన్‌లో అత్యధిక సార్లు ఈ ఘనత సాధించిన జట్టుగా నిలిచింది.

సంజు శాంసన్ విశ్వరూపం- విరాట్ కోహ్లీ రికార్డు బ్రేక్ ఈ వరల్డ్ కప్ లో సంజు శాంసన్ బ్యాటింగ్ లో సరికొత్త రికార్డులను సృష్టించారు. టోర్నీ మొత్తంలో 321 పరుగులు చేసి, ఒకే టీ20 వరల్డ్ కప్ ఎడిషన్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా నిలిచారు. గతంలో విరాట్ కోహ్లీ పేరిట ఉన్న రికార్డును సంజు అధిగమించడం విశేషం. ఫైనల్ మ్యాచులో 89 పరుగులు చేసిన సంజు, వరల్డ్ కప్ ఫైనల్ చరిత్రలోనే అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఆటగాడిగా మార్లన్ శామ్యూల్స్ (85) రికార్డును చెరిపివేశారు. సంజుకు తోడుగా అభిషేక్ శర్మ (52), ఇషాన్ కిషన్ (54) కూడా అర్ధ సెంచరీలతో కివీస్ బౌలర్లను చిత్తు చేశారు.

పరుగుల పరంగా అతిపెద్ద విజయం ఫైనల్ లో న్యూజిలాండ్ పై 96 పరుగుల తేడాతో గెలిచిన భారత్, టీ20 వరల్డ్ కప్ ఫైనల్ చరిత్రలోనే పరుగుల పరంగా అతిపెద్ద విజయాన్ని నమోదు చేసింది. 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కివీస్, జస్ప్రీత్ బుమ్రా (4 వికెట్లు), అక్షర్ పటేల్ (3 వికెట్లు) ధాటికి 159 పరుగులకే కుప్పకూలింది. భారీ స్కోరు సాధించడమే కాకుండా, బౌలింగ్ లో కూడా కివీస్ పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి భారత్ ఏకపక్షంగా ఈ మ్యాచును గెలుచుకుంది. ఒత్తిడిలో కివీస్ బ్యాటర్లు చేతులెత్తేయడం భారత్ కు కలిసి వచ్చింది.

మూడు సార్లు విశ్వవిజేత

భారత జట్టు ఈ విజయంతో తన మూడవ టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ప్రపంచంలో మూడు సార్లు ఈ ఘనత సాధించిన ఏకైక జట్టుగా టీమ్ఇండియా రికార్డు సృష్టించింది. అంతేకాకుండా, 2024లో టైటిల్ గెలిచిన భారత్, ఇప్పుడు మళ్లీ గెలిచి టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే వరుసగా రెండుసార్లు టైటిల్‌ను డిఫెండ్ చేసుకున్న తొలి జట్టుగా నిలిచింది. గతంలో ఏ జట్టుకూ సాధ్యం కాని ఈ అరుదైన ఫీట్‌ను సూర్య సేన సాధించి చూపింది. సొంత గడ్డపై ఆడుతూ ప్రపంచకప్ గెలిచిన మొట్టమొదటి ఆతిథ్య దేశంగా కూడా భారత్ ట్రెండ్ సెట్ చేసింది. వరుసగా రెండు టీ20 ప్రపంచకప్‌లు, ఒక ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన భారత్ ప్రస్తుతం గోల్డెన్ ఎరాలో కొనసాగుతోంది. అహ్మదాబాద్ వేదికగా పాత గాయాలను చెరిపేస్తూ, సరికొత్త రికార్డులతో ప్రపంచ ఛాంపియన్‌గా నిలవడం భారత క్రికెట్ కు ఒక చారిత్రాత్మక విజయం. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో యువ రక్తం ఉరకలేస్తున్న టీమ్ఇండియా, భవిష్యత్తులో మరిన్ని అద్భుతాలు చేయడానికి సిద్ధంగా ఉందని చెప్పవచ్చు. ఇక 2027లో వరల్డ్ కప్ కూడా అందుకోవాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. మరి ఆ టోర్నీకి టీమ్ ఇండియా ఎలా సిద్ధమవుతుందో చూడాలి.

# 'బుమ్రా జాతీయ సంపద- అతడు తరానికి ఒకసారి వచ్చే బౌలర్'- కెప్టెన్ సూర్య ప్రశంసలు

### ప్రపంచకప్ గెలిచిన అనంతరం మాట్లాడిన కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్




భారత స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రాపై ప్రశంసల జల్లు కురిపించారు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్. టీ 20 ప్రపంచ కప్ గెలిచిన అనంతరం మాట్లాడిన సూర్య, బుమ్రాను జాతీయ సంపదగా అభివర్ణించారు. "బుమ్రా తరానికి ఒకసారి వచ్చే బౌలర్. నేను అతడిని జాతీయ సంపదగా భావిస్తాను. మ్యాచ్ ను ఎలా మలుపు తిప్పాలో అతడికి బాగా తెలుసు. బుమ్రా ఈ రంగంలో అత్యుత్తముడు. అతడు తన పనిని సమర్థంగా నిర్వర్తిస్తున్నాడు." అని కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ కొనియాడారు. ఈ క్రమంలోనే జట్టుకు అపూర్వమైన విజయాన్ని అందించిన ఆటగాళ్లను ప్రశంసించారు. "నాకు చాలా సంతోషంగా ఉంది. ఇది చాలా సుదీర్ఘ ప్రయాణం. 2024 ప్రపంచకప్ తర్వాత నా ప్రస్థానం ప్రారంభమైంది. అప్పటి బీసీసీఐ అధ్యక్షుడు జై షా, కెప్టెన్ రోహిత్ సహా వారందరూ నాపై నమ్మకం ఉంచి నాకు నాయకత్వం వహించే అవకాశం ఇచ్చారు. అక్కడి నుంచి చాలా సుదీర్ఘ ప్రయాణం చేసి దీనిని సాధించాను. గత రెండు సంవత్సరాలుగా మేము మంచి క్రికెట్ ఆడుతున్నాము. 2024 ప్రపంచకప్‌లో అలవాటు చేసుకున్న మంచి క్రికెట్ అలవాట్లను అనుసరించాలని మేము కోరుకున్నాము. నిజంగానే మా జట్టు అంతా వాటిని బాగా పాటించారు. ముఖ్యంగా ఆటగాళ్ల సామర్థ్యం ఏమిటో అర్థం చేసుకోవడం నిజంగా ముఖ్యమని నేను భావిస్తున్నాను. శాంసన్, అభిషేక్ , వరుణ్ మ్యాచ్ విన్నర్లు అని నాకు తెలుసు. సంజు శాంసన్, అభిషేక్ శర్మ వంటి అగ్రశ్రేణి ఆటగాళ్లు ఏదైనా చేస్తారని మాకు తెలుసు. వారు ఫైనల్‌లో దానిని చేసి నిరూపించారు." --సూర్య కుమార్ యాదవ్ , భారత కెప్టెన్ లింపిక్స్ లో గోల్డ్ మెడల్ మా టార్గెట్ : సూర్య అటు తమ తర్వాతి ఆశయం ఏంటో వివరించారు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్. తమ తదుపరి లక్ష్యం 2028 ఒలింపిక్స్ లో గోల్డ్ మెడల్ సాధించడమేనని వెల్లడించారు. "గత నెల రోజులుగా సాగిన ఈ ప్రపంచకప్ ప్రయాణం అద్భుతం. జట్టు అంతా కలిసికట్టుగా ఆడి ప్రపంచకప్ ను సొంతం చేసుకున్నాం. ఇప్పుడు మా తదుపరి లక్ష్యం ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ గెలవడం. అలాగే అదే సంవత్సరం (2028) రగనున్న టీ20 వరల్డ్ కప్ గెలవడం. 2024 తర్వాత పూర్తిగా మారిపోయింది. మేము సరికొత్త బ్రాండ్ క్రికెట్ ఆడాం. ఆ తర్వాత 2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచాం. ఇప్పుడు 2026లో సొంత అభిమానుల మధ్యలో సాధించాలని అనుకున్నాం. ఇదే జోరును వచ్చే 2027, 28, 29లో కొనసాగించాలని అనుకుంటున్నాం." అని సూర్యకుమార్ యాదవ్ తెలిపారు. కాగా, దాదాపు 128 సంవత్సరాల తర్వాత ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు స్థానం కల్పించబోతున్నారు. లాస్‌ఏంజిలెస్‌లో 2028లో జరగనున్న ఒలింపిక్స్‌లో టీ20 ఫార్మాట్లో క్రికెట్ పోటీలు జరగనున్నాయి. విజేతగా నిలిచిన జట్టుకు గోల్డ్‌మెడల్ బహుమతిగా అందించనున్నారు. కాగా, టీ-20 ప్రపంచకప్‌లో భారత్ విశ్వవిజేతగా నిలిచింది. ఫైనల్ పోరులో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ మెరుపు బ్యాటింగ్, బుమ్రా, అక్షర్ పటేల్ అద్భుత బౌలింగ్‌తో జట్టుకు చిరస్మరణీయమైన విజయాన్ని అందించారు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా టోర్నీ బరిలో దిగిన టీమిండియా టైటిల్‌ను నిలబెట్టుకోవడం సహా సొంతగడ్డపై తొలిసారి ట్రోఫీని ముద్దాడింది. ఈ మెగా టోర్నీ లీగ్ దశలో అజేయంగా నిలిచిన భారత్ జట్టు సూపర్-8లో దక్షిణాఫ్రికాపై ఓటమి మినహా కీలక మ్యాచ్‌లలో విజయ పరంపరను కొనసాగించింది. నాకౌట్ మ్యాచ్‌లలో అద్భుతమైన పోరాట స్ఫూర్తిని కనబర్చి కోట్లాది అభిమానుల్లో ఆనందం నింపింది.

# వరల్డ్ కప్ ప్రైజ్ మనీ లిస్ట్ వచ్చేసింది.. సెమీఫైనల్, గ్రూప్ స్టేజ్ జట్లకు కూడా కాసుల పంట

### 2026 టీ20 వరల్డ్ కప్ విజేతగా నిలిచిన భారత్ రూ.27.48 కోట్ల ప్రైజ్ మనీని అందుకుంది. రన్నరప్ న్యూజిలాండ్‌కు రూ.14.65 కోట్లు లభించగా, మొత్తం రూ.120 కోట్ల ప్రైజ్ పూల్‌ను ఐసీసీ పంపిణీ చేసింది.ఈ మెగా టోర్నీలో పాల్గొన్న ప్రతి జట్టుపై ఐసీసీ కాసుల వర్షం కురిపించింది.



అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం సాక్షిగా ఆదివారం టీమిండియా సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతా కాదు. న్యూజిలాండ్‌ను 96 పరుగుల తేడాతో మట్టికరిపించి, వరుసగా రెండోసారి టీ20 వరల్డ్ కప్ 2026 కైవసం చేసుకుని భారత్ చరిత్ర సృష్టించింది. ఈ అద్భుత విజయంతో ఐసీసీ ప్రకటించిన భారీ ప్రైజ్ మనీ టీమిండియా ఖాతాలో చేరింది. అయితే కేవలం భారత్, న్యూజిలాండ్ మాత్రమే కాదు.. ఈ మెగా టోర్నీలో పాల్గొన్న ప్రతి జట్టుపై ఐసీసీ కాసుల వర్షం కురిపించింది. మొత్తం రూ.120 కోట్ల భారీ ప్రైజ్ పూల్‌ను ఐసీసీ ఎలా పంపిణీ చేసిందో వివరంగా తెలుసుకుందాం.

విజేత భారత్‌కు భారీ నజరానా.. కివీస్‌కు సగం

ప్రపంచ విజేతగా నిలిచిన టీమిండియాకు ఐసీసీ 3 మిలియన్ అమెరికన్ డాలర్లను బహుమతిగా ఇచ్చింది. మన భారత కరెన్సీలో దీని విలువ సుమారు రూ.27.48 కోట్లు. గత వరల్డ్ కప్‌తో పోలిస్తే ఈసారి ప్రైజ్ మనీ దాదాపు రూ.4 కోట్లు పెరగడం విశేషం. ఇక రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్ జట్టుకు దాదాపు రూ.14.65 కోట్లు దక్కాయి. ఫైనల్లో ఓడినప్పటికీ, టోర్నీ ఆద్యంతం అద్భుతంగా ఆడినందుకు కివీస్‌కు ఈ భారీ మొత్తం లభించింది.

సెమీ ఫైనలిస్టులు, సూపర్-8 జట్లకు ఎంతంటే

సెమీ ఫైనల్ వరకు వచ్చి తృటిలో ఫైనల్ చేరలేకపోయిన ఇంగ్లాండ్, సౌతాఫ్రికా జట్లకు ఐసీసీ తలా రూ.7.24 కోట్లు అందజేసింది. ఇక సూపర్ 8 దశకు చేరుకుని వెనుదిరిగిన జట్లు కూడా తక్కువ ఏమీ సంపాదించలేదు. పాకిస్థాన్, జింబాబ్వే, శ్రీలంక, వెస్టిండీస్ జట్లకు ఒక్కో జట్టుకు రూ.3.48 కోట్లు చొప్పున ప్రైజ్ మనీ దక్కింది. అంటే టోర్నీలో ఎంత ముందుకు వెళ్తే అంత ఎక్కువ డబ్బులు జట్లకు అందాయన్నమాట.

గ్రూప్ స్టేజ్ జట్లకు కూడా కోట్ల పంట

ఈ టోర్నీలో కనీసం గ్రూప్ స్టేజ్ దాటలేకపోయిన జట్లు కూడా ఖాళీ చేతులతో ఇంటికి వెళ్లలేదు. ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్, కెనడా, యూఏఈ, యూఎస్ఏ, నెదర్లాండ్స్, స్కాట్లాండ్, నేపాల్, ఐర్లాండ్, ఇటలీ, ఒమన్, నమీబియా.. ఇలా మొత్తం 12 జట్లకు ఐసీసీ ఒక్కో జట్టుకు రూ.2.29 కోట్లు పంపిణీ చేసింది. ఆస్ట్రేలియా లాంటి దిగ్గజ జట్టు గ్రూప్ స్టేజ్‌లోనే వెనుదిరగడం అందరినీ ఆశ్చర్యపరిచినప్పటికీ, వారికి కూడా ఐసీసీ తగిన నజరానాను అందించింది. మొత్తానికి 2026 టీ20 వరల్డ్ కప్ కేవలం ఆట పరంగానే కాదు, ఆదాయం పరంగా కూడా జట్లకు మంచి లాభాలను తెచ్చిపెట్టింది. ముఖ్యంగా భారత క్రికెట్ నియంత్రణ మండలి ఇప్పటికే ప్లేయర్లకు అదనపు బోనస్‌లు ప్రకటించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ గెలుపుతో భారత్ కీర్తి ప్రతిష్టలు ప్రపంచవ్యాప్తంగా మరోసారి మారుమోగిపోయాయి.

# వరల్డ్ కప్ గెలిచాం.. ఇక ఒలింపిక్స్ గోల్డే మా టార్గెట్.. కెప్టెన్ సూర్య సంచలన ప్రకటన

### అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఆదివారం (మార్చి 8) టీమిండియా సరికొత్త చరిత్ర సృష్టించింది. న్యూజిలాండ్‌ను 96 పరుగుల తేడాతో మట్టికరిపించి, భారత్ మూడోసారి టీ20 ప్రపంచ విజేతగా నిలిచింది. ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మల తర్వాత ఈ ఘనత సాధించిన మూడో భారత కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ రికార్డుల్లోకెక్కాడు.



అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఆదివారం (మార్చి 8) టీమిండియా సరికొత్త చరిత్ర సృష్టించింది. న్యూజిలాండ్‌ను 96 పరుగుల తేడాతో మట్టికరిపించి, భారత్ మూడోసారి టీ20 ప్రపంచ విజేతగా నిలిచింది. ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మల తర్వాత ఈ ఘనత సాధించిన మూడో భారత కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ రికార్డుల్లోకెక్కాడు. అయితే, ప్రపంచకప్ గెలిచిన ఆనందంలో మునిగిపోకుండా, స్కై తన తదుపరి లక్ష్యాన్ని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. టీమిండియా తదుపరి గురి ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించడమేనని సూర్య స్పష్టం చేశాడు. వరల్డ్ కప్ గెలిచిన అనంతరం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఈ విజయం చాలా ప్రత్యేకం కానీ ఇక్కడితో ఆగిపోమని చెప్పాడు. "మా ముందు పెద్ద లక్ష్యాలు ఉన్నాయి. 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ తిరిగి వస్తోంది. అక్కడ గోల్డ్ మెడల్ గెలవడమే మా తదుపరి మిషన్. అదే ఏడాది జరిగే టీ20 వరల్డ్ కప్‌ను కూడా ముద్దాడాలని ఉంది" అని తన మనసులోని మాటను బయటపెట్టాడు. 1900 ఒలింపిక్స్ తర్వాత దాదాపు 128 ఏళ్లకు క్రికెట్ మళ్ళీ ఒలింపిక్ వేదికపైకి రాబోతుండటంతో, భారత్ అక్కడ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించాలని పట్టుదలగా ఉంది. ఒకప్పుడు ఐసీసీ ట్రోఫీ కోసం 11 ఏళ్లు నిరీక్షించిన భారత జట్టు, ఇప్పుడు వరుస విజయాలతో దూసుకుపోతోంది. 2024లో రోహిత్ శర్మ కౌశల్యంతో టీ20 వరల్డ్ కప్ గెలిచిన భారత్, 2025లో న్యూజిలాండ్‌ను ఓడించి ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఇప్పుడు 2026లో సూర్య నాయకత్వంలో మళ్ళీ టీ20 వరల్డ్ కప్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఇలా కేవలం మూడేళ్ల వ్యవధిలోనే మూడు ఐసీసీ ట్రోఫీలను గెలిచి ప్రపంచ క్రికెట్‌లో తిరుగులేని శక్తిగా అవతరించింది. టీమిండియా అనుసరిస్తున్న అగ్రెసివ్ అప్రోచ్ ఈ విజయాలకు ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. సూర్య సేన ఇప్పుడు వరుస విజయాల జోరులో ఉంది. వచ్చే ఏడాది(2027)లో దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యమిచ్చే వన్డే వరల్డ్ కప్‌పై భారత్ కన్నేసింది. ఒకవేళ ఆ ట్రోఫీని కూడా గెలిస్తే, క్రికెట్ చరిత్రలో భారత్ ఒక అజేయమైన శకంగా నిలిచిపోతుంది. రోహిత్ పెట్టిన పునాదిని సూర్య పటిష్టం చేస్తూ, యువ ఆటగాళ్లతో జట్టును ఒలింపిక్ గోల్డ్ వైపు నడిపిస్తున్న తీరు చూస్తుంటే.. భారత్ క్రీడా ప్రపంచంలో మరో సంచలనం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

# ట్రోల్ చేసినా నిలబడ్డాడు- ఎవరికీ సాధ్యం కానిది కొట్టి చూపించాడు'- గంభీర్ అన్ స్టాపబుల్!

### టీ20 వరల్డ్ కప్ లో తనదైన మార్క్ - ఏడాదిలో రెండు ఐసీసీ ట్రోఫీలతో అరుదైన రికార్డులు- ఇదీ గంభీర్ కథ!



భారత క్రికెట్ లో గౌతమ్ గంభీర్ పేరు మరోసారి మార్మోగిపోతోంది. టీమ్ఇండియా ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలంలోనే అతను అద్భుతాలు సృష్టిస్తున్నాడు. అయితే మధ్యమధ్యలో తనపై అనేక విమర్శలు వచ్చినా అవేమి పట్టించుకోకుండా ముందుకు సాగాడు. తాజాగా అహ్మదాబాద్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్‌లో భారత్ ఘనవిజయం సాధించడంతో గంభీర్ ఖాతాలో ఒక అరుదైన ప్రపంచ రికార్డు చేరింది. రెండు విధాలుగా టీ20 వరల్డ్ కప్ గెలిచిన తొలి క్రికెటర్‌గా అతడు అరుదైన ఘనత సాధించాడు.

గంభీర్ అన్‌స్టాపబుల్

గౌతమ్ గంభీర్ ప్రయాణం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. 2007లో జరిగిన మొట్టమొదటి టీ20 వరల్డ్ కప్ ఫైనల్ నెగ్గిన భారత జట్టులో అతడు సభ్యుడు. ఆ టోర్నీలో ప్లేయర్‌గా అద్భుత ఇన్నింగ్స్ ఆడి భారత్‌కు కప్పు అందించడంలో కీలక పాత్ర పోషించాడు. సరిగ్గా 19 ఏళ్ల తర్వాత, 2026లో అదే టోర్నీలో మళ్లీ టీ20 వరల్డ్ కప్ ను అందుకున్నాడు. అయితే ఈసారి కోచ్ గా ఆ ఘనత సాధించాడు. జట్టుకు కోచ్‌గా ఉంటు తన వ్యూహాలతో టీమ్ఇండియాను విజేత నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఇలా రెండు విభిన్న పాత్రల్లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలవడం క్రికెట్ లో ఇదే తొలిసారి. దీనికి తోడు 2011 వన్డే వరల్డ్ కప్ విజేత జట్టులో కూడా గంభీర్ సభ్యుడిగా కీలకపాత్ర పోషించాడు.

రెండు ఐసీసీ ట్రోఫీలు- టీమ్ఇండియా కోచ్‌గా సరికొత్త రికార్డు

భారత సీనియర్ పురుషుల జట్టు కోచ్‌లలో ఇంతవరకు ఎవరికీ సాధ్యం కాని రికార్డును గంభీర్ అందుకున్నాడు. కేవలం రెండేళ్లలోపే రెండు ఐసీసీ ట్రోఫీలు (2025 ఛాంపియన్స్ ట్రోఫీ, 2026 టీ20 వరల్డ్ కప్) గెలిపించిన ఏకైక కోచ్‌గా నిలిచాడు. గతేడాది దుబాయ్‌లో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో కివీస్‌ను 4 వికెట్ల తేడాతో ఓడించిన భారత్, ఇప్పుడు అహ్మదాబాద్‌లో అదే కివీస్‌ను 96 పరుగుల తేడాతో చిత్తు చేసి వరుస విజయాలను అందుకుంది. ఈ రెండు భారీ విజయాల వెనుక గంభీర్ మాస్టర్ మైండ్ ఉందనడంలో సందేహం లేదు.

గంభీర్ సూర్య పవర్ఫుల్ కాంబినేషన్

గౌతమ్ గంభీర్ తన దూకుడు స్వభావంతో జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపాడు. సీనియర్లు, జూనియర్ల మధ్య సమన్వయం కుదురుస్తూ తీసుకున్న నిర్ణయాలు నేడు భారత్‌కు మరో కప్పు తెచ్చిపెట్టాయి. ముఖ్యంగా సంజు శాంసన్, అభిషేక్ శర్మ వంటి ఆటగాళ్లపై ఉంచిన నమ్మకం ఫైనల్ మ్యాచ్ లో సరైన ఫలితాన్ని ఇచ్చింది. వరుసగా రెండు ఐసీసీ ట్రోఫీలు గెలిచిన గంభీర్, భవిష్యత్తులో మరిన్ని విజయాలను టీమ్ఇండియాకు అందిస్తారని అభిమానులు ఆశిస్తున్నారు.

ఆరోపణలు వచ్చినా!

కోచ్‌గా గంభీర్ ప్రయాణం అంత సాఫీగా ఏమీ సాగలేదు. ముఖ్యంగా టెస్టు ఫార్మాట్‌లో టీమ్ఇండియా వరుసగా ఎదుర్కొన్న కొన్ని వైఫల్యాలు విమర్శల వర్షం కురిపించాయి. సంప్రదాయ క్రికెట్‌లో కూడా అగ్రెసివ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని గంభీర్ చేసిన ప్రయోగాలు ఆశించిన ఫలితాలను ఇవ్వకపోవడంతో, కోచింగ్ శైలిపై నెగిటివ్ కామెంట్స్ గట్టిగానే వచ్చాయి. సీనియర్ ఆటగాళ్లను పక్కన పెట్టి కుర్రాళ్లకు అవకాశం ఇవ్వడం వంటి కఠిన నిర్ణయాలు తీసుకున్నప్పుడు, అది జట్టు బలాన్ని దెబ్బతీస్తోందనే వాదనలు కూడా గట్టిగా వినిపించాయి. ఆ సమయంలో గంభీర్ వ్యూహాలు కేవలం పరిమిత ఓవర్ల క్రికెట్‌కే పరిమితమా అనే ప్రశ్నలు తలెత్తినా, అతను మాత్రం తన పంథాను మార్చుకోకుండా జట్టును ముందుకు నడిపించాడు. వరుస విమర్శలు ఎదురైనప్పటికీ గంభీర్ తనపై ఉన్న నమ్మకాన్ని వదులుకోలేదు. టెస్టుల్లో ఎదురైన ఆ ఒడుదొడుకుల నుంచే పాఠాలు నేర్చుకుని, వైట్ బాల్ క్రికెట్‌లో టీమ్ఇండియాను ఛాంపియన్ జట్టుగా నడిపిస్తున్నాడు. విమర్శలు వచ్చిన ప్రతిసారీ తనదైన శైలిలో సమాధానమిచ్చే గంభీర్, ఇప్పుడు ఏకకాలంలో రెండు ఐసీసీ ట్రోఫీలు అందించి అందరి నోళ్లు మూయించాడు. విమర్శలను విజయాలుగా మార్చుకోవడంలో ఆయనకు ఆయనే సాటి అని ఈ గెలుపుతో మరోసారి నిరూపించాడు. ప్రయోగాలు విఫలమైనా వెనకడుగు వేయకుండా, ఫైనల్ గా జట్టును ప్రపంచ విజేతగా నిలబెట్టిన గంభీర్ అసలైన 'మాస్టర్ మైండ్' అని క్రికెట్ పండితులు ఇప్పుడు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## ఎలైట్ లిస్ట్ లో సూర్యకుమార్

# టీమ్ఇండియాకు వరల్డ్ కప్ అందించిన కెప్టెన్లు వీళ్లే!

### కపిల్ దేవ్ నుంచి సూర్యకుమార్ యాదవ్ దాకా- భారత్ ను ప్రపంచ కప్ విజేతలుగా నిలిపిన కెప్టెన్లు లిస్ట్ ఇదే

భారత్ క్రికెట్ జట్టుకు ఇప్పటిదాకా అనేక మంది కెప్టెన్లుగా వ్యవహరించారు. టీమ్ఇండియాకు కెప్టెన్ గా వ్యవహరించడం గొప్ప గౌరవంగా భావిస్తారు. కానీ ఆ అవకాశం అందరికీ దక్కదు. ముఖ్యంగా ఐసీసీ టోర్నమెంట్ ల్లో భారత్ ను నడిపించే అవకాశం దక్కడం గొప్ప ఛాన్స్. అదే ఐసీసీ టోర్నీల్లో టీమ్ఇండియాను విజేతగా నిలిపితే దక్కే గౌరవమే వేరు. అలాంటి అవకాశం సూర్యకుమార్ కు దక్కింది. తన కెప్టెన్సీలో భారత్ ను విశ్వవిజేతగా నిలిపాడు. అయితే అతి తక్కువ మంది కెప్టెన్లే ఇప్పటిదాకా భారత్ కు ప్రపంచకప్ అందించారు. మరి వాళ్లెవరో ఇప్పుడు చూద్దాం! కపిల్ దేవ్ భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ భారత క్రికెట్‌లో స్వర్ణయుగాన్ని ప్రారంభించాడు. అతని నాయకత్వంలో, భారత్ మొదటిసారి ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకుంది. 1983 ఫైనల్‌లో అతను పటిష్ఠమైన వెస్టిండీస్‌ను ఓడించి భారత్ కు తొలి ప్రపంచ కప్ అందించాడు. అలా భారత్ కు తొలి వరల్డ్‌కప్ అందించిన కెప్టెన్ గా కపిల్ దేవ్ చరిత్ర పుటల్లో నిలిచిపోయాడు. భారత్ కు తొలి వరల్డ్ కప్ సాధించిన కపిల్ దేవ్ కపిల్ దేవ్ తర్వాత ఆ ఘనత ధోనీకే దక్కింది. మహేంద్ర సింగ్ ధోనీ భారత్ అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా పేరు దక్కించుకున్నాడు. అతడి కెప్టెన్సీలో టీమ్ఇండియా మూడు ప్రపంచ కప్ ఫైనల్స్‌కు (రెండుసార్లు ు20, ఒకసారి వన్డే) చేరుకుంది. ఇందులో ధోనీ నాయకత్వంలో భారత్ 2007లో ు20 ప్రపంచ కప్, 2011లో వన్డే వరల్డ్ కప్ గెలుచుకుంది. రోహిత్ శర్మ (2024 ు20)పిల్, ధోనీ తర్వాత ఈ ఎలైట్ లిస్ట్ లో రోహిత్ శర్మ స్థానం దక్కించుకున్నాడు. టీమ్ఇండియాకు దాదాపు 11ఏళ్ల తర్వాత ఐసీసీ ట్రోఫీ అందించిన కెప్టెన్ గా నిలిటాడు. అతడి కెప్టెన్సీలో భారత్ 2024 టీ20 వరల్డ్ కప్ ఛాంపియన్ గా నిలిచింది. ఇదే కాకుండా భారత్ జట్టును దూకుడు, డేరింగ్ గేమ్ అప్రోచ్ టీమ్‌గా మార్చాడు. అతడి నాయకత్వంలో భారత్ వరుసగా 2023 వన్డే, 2024 టీ20, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్స్ కు చేరింది. ఇందులో వన్డే వరల్డ్ కప్ మినహా రెండు టోర్నీల్లో భారత్ ను రోహిత్ విజేతగా నిలిపాడు. టీ20 వరల్డ్ కప్ ట్రోఫీతో రోహిత్ సూర్యకుమార్ యాదవ్ (2026 ు20 ప్రపంచ కప్)ఈ జాబితాలో ఇప్పుడు సూర్యకుమార్ యాదవ్ చేరిపోయాడు. భారత్ కు వరల్డ్ కప్ అందించిన నాలుగో కెప్టెన్ గా అరుదైన ఘనత

## ఓదెలలో వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమం ముగింపు..



ఓదెల//**మార్చి 09 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని స్థానిక ఐకేపీ సమావేశ మందిరంలో మార్చి 3వ తేదీ నుంచి నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమం సోమవారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) వెన్నపురెడ్డి అనిల్ రెడ్డి శిక్షణలో పాల్గొన్న వివిధ గ్రామ పంచాయతీల వార్డు సభ్యులను శాలువాలతో సన్మానించి, శిక్షణ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం వార్డు సభ్యులతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా పంచాయతీరాజ్ చట్టం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజలకు అందించాల్సిన సేవలు, గ్రామ స్థాయిలో పరిపాలనా విధానాలు వంటి అంశాలపై సమగ్ర అవగాహన కలిగిందని తెలిపారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు తరచుగా నిర్వహిస్తే గ్రామాల అభివృద్ధిలో మరింత సమర్థవంతంగా పనిచేయడానికి దోహదపడుతాయని అభిప్రాయపడ్డారు. శిక్షణ కార్యక్రమం సమయంలో మంచి వసతి, భోజన సదుపాయాలు కల్పించినందుకు ఎంపీడీఓ వెన్నపురెడ్డి అనిల్ రెడ్డికి వార్డు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా బీమరపల్లి తదితర గ్రామపంచాయతీల పాలకవర్గ సభ్యులు ఎంపీడీఓను శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా శిక్షణ అందించిన ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ (టీఓటీ) సభ్యులను కూడా వార్డు సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పి. నాగరాజు, ఎస్. భాస్కర్, వి. సాగర్, ఎన్. రణధీర్ కుమార్, వి. సురేష్, జె. శివ కుమార్, వేణుగోపాల్, ఏ. రామ్మోహన్ టీఓటీ లుగా వ్యవహరించి వార్డు సభ్యులకు శిక్షణ అందించారు. కార్యక్రమంలో పలు గ్రామ పంచాయతీల వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## మహిళలకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు...



నాగర్‌కర్నూల్//**మార్చి 09 (ఆకాంక్ష) :** నేటి డిజిటల్ యుగంలో మహిళలు సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని, అపరిచితులపై విశ్వాసం ఉంచకూడదని సైబర్ క్రైమ్ సెల్ సబ్ ఇన్‌స్పెక్టర్ రమాదేవి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగర్‌కర్నూల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ ప్రభుత్వ కళాశాలలో సోమవారం మహిళలకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మరియు మహిళలకు ఇంటర్నెట్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరణాత్మకంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా సైబర్ బుల్లీయింగ్, సైబర్ స్టాకింగ్, ఇంపర్సనేషన్, హనీ ట్రాప్ వంటి మోసాల గురించి వివరించి, ఇలాంటి సంఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సోషల్ మీడియా వేదికల్లో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు లేదా సందేశాలకు స్పందించకూడదని సూచించారు. అలాగే సీసామ్ (జూూవీ) కేసుల గురించి కూడా అవగాహన కల్పిస్తూ, చిన్నారులపై జరిగే సైబర్ దాడులు తీవ్రమైన నేరాలుగా పరిగణించబడతాయని తెలిపారు. ఎవరైనా ఇలాంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సెల్ సబ్ ఇన్‌స్పెక్టర్ రమాదేవి, కానిస్టేబుల్ రవికుమార్, షీ టీం సబ్ ఇన్‌స్పెక్టర్ రజిత, కళాశాల ప్రిన్సిపల్ గీతాంజలి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి విద్యార్థినులు మరియు కళాశాల సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై సైబర్ భద్రతపై అవగాహన పొందారు.

## ప్రజావాణిలో 06 ఫిర్యాదులు...



నాగర్ కర్నూల్//**మార్చి 09 (ఆకాంక్ష) :** ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం నాగర్ కర్నూల్ జిల్లాలో మొత్తం ఆరు ఫిర్యాదులు నమోదయ్యాయి. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుండి ఫిర్యాదు దారులు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు ఫిర్యాదు దారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును జాగ్రత్తగా పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులకు పంపిస్తూ, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులలో ఒకటి భార్యాభర్తల మధ్య కుటుంబ వివాదానికి సంబంధించినది కాగా, మరో ఐదు ఫిర్యాదులు తగు న్యాయం కోరుతూ ఇచ్చినవిగా అధికారులు తెలిపారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి పరిష్కరించడం పోలీస్ శాఖ ముఖ్య బాధ్యత అని అడిషనల్ ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావడానికి ప్రజావాణి మంచి వేదికగా ఉపయోగ పడుతుందని తెలిపారు. ప్రజలు చట్టబద్ధమైన సమస్యలపై ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదులు ఇవ్వాలని ఆయన సూచించారు. అలాగే అందిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు.

## నేడు సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి కార్యక్రమం...



నాగర్ కర్నూల్ టౌన్//**మార్చి 09 (ఆకాంక్ష) :** భారతదేశంలోని తొలి మహిళ ఉపాధ్యాయురాలు, చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి సందర్భంగా మంగళవారం బిజినేపల్లి మండల కేంద్రంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావ్ పూలేఅంబేద్కర్ చౌరస్తాలో ఉదయం 9 గంటలకు బీసీ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల బీసీ కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కమిటీ సభ్యులు, మండల నాయకులు, ఎమ్మార్పీఎస్, బీఎస్పీ పార్టీ నాయకులు, దళిత, గిరిజన సంఘాల ప్రతినిధులు, మహిళలు, ప్రజాప్రతినిధులు, యువకులు, కవులు, కళాకారులు, మేధావులు, రిటైర్డ్ బహుజన ఉద్యోగులు, పత్రికా మరియు మీడియా ప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బంధువులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజినేపల్లి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘ సభ్యులు కోరారు.

## కేజీబీవీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్...



జడ్చర్ల//**మార్చి 09 (ఆకాంక్ష) :** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందిని తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని యుఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. నర్సింహులు ప్రభుత్వాన్ని కోరారు. జీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మిడ్జిల్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్. నర్సింహులు మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు. సమగ్ర శిక్షణ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు టైమ్ స్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కేజీబీవీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయడంతో పాటు అన్ని ఉద్యోగులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని ఆయన కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘం శాంతియుత మార్గంలో పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కేజీబీవీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి రమేష్, కస్తూర్బా ప్రత్యేక అధికారి కవిత, ఉపాధ్యాయులు అజిత, శిరీష, ధనలక్ష్మి, విజయలక్ష్మి, చంద్రకళ, శ్యామల కుమారి తదితరులు పాల్గొన్నారు.

## మిడ్జిల్‌లో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం...



జడ్చర్ల//**మార్చి 09 (ఆకాంక్ష) :** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజక వర్గంలోని మిడ్జిల్ మండలంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో మహిళల పాత్ర, సేవలను గుర్తిస్తూ స్థానిక అధికారులను అంబేద్కర్ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలోని ఎమ్మార్వో, ఎండీఓ మరియు ఆర్ఐలను అంబేద్కర్ సంఘం నాయకులు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలతో అభినందించారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తున్నాయని ఈ సందర్భంగా సంఘం నాయకులు పేర్కొన్నారు. మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల అభివృద్ధి, సాధికారతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమాజంలో మహిళలు అన్ని రంగాలలో ముందంజలో నిలుస్తూ దేశాభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు బరిగెల దేవయ్య, సభ్యులు బాలయ్య, బుచ్చయ్య, మావిళ్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది.

## పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి...

### సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుంపల్లి అశోక్ డిమాండ్...



నాగర్ కర్నూల్/**మార్చి 09 (ఆకాంక్ష) :** కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుంపల్లి అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం బిజినేపల్లి బస్టాండ్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధరల పెంపుపై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుంపల్లి అశోక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ పై రూ. 115, గృహ వినియోగ వంట గ్యాస్ పై రూ. 60 పెంచడం తీవ్రంగా ఖండించదగిన చర్య అని అన్నారు. ఇప్పటికే పెరుగుతున్న ధరలతో సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో గ్యాస్ ధరలను మరింతగా పెంచడం ప్రజలపై అదనపు భారాన్ని మోపినట్లే అని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ధరల పెంపుపై తీవ్రంగా విమర్శలు చేస్తూ ప్రచారం చేసిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా దేశంలో మాత్రం ధరలు తగ్గించకుండా పెంచుతూ పెద్ద కంపెనీలకు లాభాలు చేకూర్చే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. వంట గ్యాస్ ధరలు పెరగడంతో ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గృహ ఖర్చులు భరించలేని స్థితికి చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకుని సాధారణ ప్రజలకు ఉపశమనం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు, వెంకటయ్య, రాములు, నరేందర్, కృష్ణయ్య తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాలలు, కళాశాలల్లో టెలి మానస్ స్టిక్కర్ల ప్రదర్శన...



నాగర్ కర్నూల్//**మార్చి 09 (ఆకాంక్ష) :** విద్యార్థులు ఆందోళన లేదా మానసిక ఒత్తిడికి గురైన సందర్భాల్లో తక్షణ సహాయం అందుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన టెలి మానస్ సేవలను వినియోగించుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ సూచించారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, ఎవరైనా మానసిక ఒత్తిడికి లోనైనప్పుడు వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 14416 కు కాల్ చేసి నిపుణుల సలహా పొందాలని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో టెలి మానస్ సేవలపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది తమ పరిధిలోని విద్యాసంస్థలను సందర్శించి ప్రతి పాఠశాల, కళాశాలలో కనీసం రెండు చొప్పున టెలి మానస్ స్టిక్కర్లను స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాల్సిందిగా సూచించారు. విద్యార్థులకు అవసరమైన సమయంలో మానసిక ఆరోగ్య సహాయం అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను పంచుకుని నిపుణుల మార్గదర్శకత్వం పొందాలని అధికారులు కోరారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత శాఖల సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

### ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వం

## ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న మహిళలు

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం - ప్రోత్సాహానికి ప్రజల నుంచి విశేష స్పందన - ఇవ్వన్ని 2047 లక్ష్యాలను చేరేందుకే చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను తీసుకుని చిన్న, మధ్య తరహా పరిశ్రమలను పలువురు మహిళలు నెలకొల్పుతున్నారు. మరికొంత మంది వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మెప్మా ద్వారా నగరాల్లో అవసరమైన మహిళలకు రుణాలను అందిస్తూ వారిని పారిశ్రామిక, వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దుతున్నారు. వ్యాపారంగంలోకి మహిళలు: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంత పరిధిలో స్వయం సహాయక సంఘాలు 8 లక్షల 33 వేల 235 ఉన్నాయి. వీటిలో 83 లక్షల 2 వేల 889 మంది సభ్యులున్నారు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంత పరిధిలో 3వేల 79 కోట్ల రూపాయల రుణాలు అందజేశారు. అదే పట్టణ ప్రాంతానికి సంబంధించి 123 పట్టణ స్థానిక సంస్థల్లో 2.47 లక్షల స్వయం సహాయక సంఘాలుండగా వీటిలో 22లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీళ్లందరికీ ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తూ పారిశ్రామిక వేత్తలుగా, వ్యాపార వేత్తలుగా అభివృద్ధి అయ్యేందుకు ప్రోత్సహిస్తోంది. దీంతో మహిళలు వివిధ రకాల వ్యాపారాలు ప్రారంభించి లాభాలు సంపాదిస్తూ మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

మహిళలను ప్రోత్యహిస్తున్న ప్రభుత్వం:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో మహిళా పారిశ్రామిక వేత్తలకు మంచి ప్రోత్సాహం అందుతోందని డ్వాక్రా మహిళలు చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టితో తమను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేయడం పట్ల వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో సరైన సపోర్ట్ లేక ఇతర ప్రాంతాల్లో ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగం చేశారని, కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిన తరువాత మహిళా పారిశ్రామికవేత్తలకు మంచి ప్రోత్సాహం అందుతుండడంతో ఏపీకి వచ్చి వ్యాపారం ప్రారంభించినట్లు విజయవాడకు చెందిన అనుష అనే మహిళ తెలిపింది.

నేను 12 ఏళ్లు హైదరాబాద్ లో జాబ్ చేశాను. ఆ అనుభవంతోనే ఈ బిస్కెట్ తయారీ వ్యాపారం చేసేందుకు ముందుకు వచ్చాను. నాకు ఎప్పటి నుంచో వ్యాపారం చేయాలని ఆసక్తిగా ఉండేది. కానీ ఇంతకు ముందు ఉన్న ప్రభుత్వం నుంచి ఎటువంటి సపోర్ట్ రాలేదు. కానీ ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత లోన్లు తొందరగా అనుమతిస్తున్నారని తెలిసి, మీాపీజులో లోన్ అప్లై చేశాను. ఆ తర్వాత మహిళా డ్వాక్రా గ్రూప్ లో జాయిన్ అయ్యాను. ప్రస్తుతం నా దగ్గర 15 మంది ఈ బిస్కెట్స్ తయారు చేస్తున్నారు. అందులో 14 మంది మహిళలే వర్కర్లుగా పని చేస్తున్నారు. మహిళా సాధికారతను పెంచాలనే ఆలోచనలతో ఈ బిజినెస్ ను ముందుకు తీసుకువెళ్తున్నాను. -అనుష మహిళా పారిశ్రామికవేత్త

ఆన్ లైన్ లోనూ వ్యాపారం చేసుకోవచ్చు:

స్వయం సహాయ సంఘాల బలోపేతానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంచి చొరవ తీసుకుంటున్నారన్న అభిప్రాయం మహిళల నుంచి వ్యక్తమౌతోంది. మహిళలు వారి ఉత్పత్తులను అమ్ముకోవడానికి అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రదర్శనలు నిర్వహిస్తోంది. పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని డ్వాక్రా సంఘాల మహిళలు వారి ప్రొడక్ట్స్ ను అమ్ముకునే అవకాశం కల్పిస్తోంది. ఆన్ లైన్ లోనూ స్వయం సహాయ సంఘాల మహిళలు బిజినెస్ చేసుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. దీంతో వారు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు తోడ్పాటు అందిస్తోంది.

2047 లక్ష్యాలను చేరేందుకు:

మెప్మా, డీఆర్డీఏ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అనేక ఎగ్జిబిషన్లు, ఉత్సవాలు నిర్వహిస్తూ మహిళల వ్యాపారాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇలాంటి ఎగ్జిబిషన్లలో స్వయం సహాయ సంఘాల సభ్యులకి ఉచితంగా స్టాల్స్ ను కేటాయిస్తూ వారి బిజినెస్ పెంచుకునేందుకు తోడ్పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్దేశించుకున్న 2047 లక్ష్యాలను చేరేందుకు ఇవన్నీ ఎంతో దోహదం చేస్తున్నాయి. ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేసే లక్ష్యంతో సాగుతున్న ప్రభుత్వ లక్ష్యాలకు ఈ చర్యలు మరింత సహాయపడుతున్నాయి.

### 'అమెరికా, ఇజ్రాయెల్‌తో మోదీ రాజీపడ్డారు'

## పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు రాహుల్ డిమాండ్

కేంద్రంపై విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ- పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చించడానికి కేంద్రం ఇష్టపడటం లేదని ఆరోపణలు



భారత ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం ఇష్టపడటం లేదని ఆరోపించారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చ జరిగితే ప్రధాని మోదీ అమెరికా, ఇజ్రాయెల్‌కు ఎలా రాజీ పడ్డారో బయటపడుతుందని అన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితులు దేశ ప్రజలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని తెలిపారు. అలాగే అక్కడి సంక్షోభం చమురు ధరల పెరుగుదలకు దారితీయవచ్చని అభిప్రాయపడ్డారు. "పశ్చిమాసియా సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద నష్టాన్ని కలిగిస్తుంది. స్టాక్ మార్కెట్లలో ఏం జరుగుతుందో మీరు చూశారు. ప్రధాని మోదీ అమెరికా ట్రేడ్ డీల్‌పై సంతకం చేశారు. దీంతో దేశం దెబ్బ తినబోతోంది. అలాగే పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చించడంలో వారికి ఏ సమస్య ఉంది? ఆ తర్వాత మనం ఇతర అంశాలపై చర్చ జరపవచ్చు. పశ్చిమాసియా మన దేశానికి ముఖ్యం కాదా ఇంధన ధరలు, ఆర్థిక విధ్వంసం మనకు ముఖ్యమైన చర్చనీయాంశాలు కావా? అవే మనకు ప్రజా సమస్యలు" అని రాహుల్ గాంధీ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని తాము ముఖ్యమైనదిగా భావిస్తున్నామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అందుకే ఆ అంశంపై చర్చను కోరుతున్నామని అన్నారు. "కానీ కేంద్ర సర్కార్ పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చ జరిపేందుకు ఇష్టపడడం లేదు. ఎందుకంటే ఆ అంశంపై చర్చ జరిపితే ఇతర విషయాలు బయటకు వస్తాయి. ప్రధాని మోదీ వైఖరి బయటపడుతుంది. మోదీ ఎలా రాజీ పడ్డారు? ఆయనను ఎలా బ్లాక్ మెయిల్ చేస్తున్నారు? వంటి విషయాలు తెలుస్తాయి. అందుకే పార్లమెంట్‌లో పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు కేంద్రం ఇష్టపడడం లేదు. చర్చకు డిమాండ్ చేస్తున్న సమయంలో ప్రధాని మోదీ పార్లమెంట్ నుంచి ఎలా పారిపోయారో మీరు చూశారు. ఒకవేళ పశ్చిమాసియా సంక్షోభంపై చర్చ జరిగితే ప్రధాని మోదీ పార్లమెంట్‌కు రాలేరు" అని రాహుల్ వ్యాఖ్యానించారు.

వీబీ జీ రామ్ జీ అమలుపై కాంగ్రెస్ ఫైర్

అలాగే వీబీ జీ రామ్ జీ అమలు నేపథ్యంలో కేంద్ర సర్కార్‌పై కాంగ్రెస్ మండిపడింది. ఈ పథకం వివరాలు ఇంకా రూపొందుతున్నాయని, ఇది మోదీ ప్రభుత్వ వేగవంతమైన విధానానికి సరైన ఉదాహరణ అని పేర్కొంది. 'మొదట ప్రకటించండి, తరువాత ఆలోచించండి' అనే విధానాన్ని కేంద్రం అనుసరిస్తోందని మండిపడింది. ఈ మేరకు కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. "2025 డిసెంబరులో కేవలం రెండు రోజుల్లోనే మోదీ ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభలో ఎంజీనరేగా రద్దును బుల్డోజ్ చేసింది. రాష్ట్రాలతో ఎటువంటి సంప్రదింపులు జరపలేదు. సంబంధిత స్టాండింగ్ కమిటీ ద్వారా ఎటువంటి పరిశీలన జరగలేదు. 2026 ఏప్రిల్ 1నుంచి కొత్త చట్టం అమలు కానుంది. దీని అమలుకు ముందుగా జరగాల్సిన సంప్రదింపులు ఇప్పుడు జరుగుతున్నాయి. వివరాలు ఇంకా రూపొందుతున్నాయి" అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

జైశంకర్ కీలక ప్రకటన

కాగా, పశ్చిమాసియా ఘర్షణల వేళ రాజ్యసభలో సోమవారం కీలక ప్రకటన చేశారు కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్. పశ్చిమాసియాలోని పరిణామాలు అందరికీ ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. వాటిపై ఎప్పటికప్పుడు ప్రధాని మోదీ సమీక్ష జరుపుతున్నారని తెలిపారు. అలాంటి పరిస్థితులకు చర్చలు, దౌత్యపరమైన చర్యలే పరిష్కారమని అభిప్రాయపడ్డారు. పశ్చిమాసియా ప్రాంతాల్లో నివసిస్తున్న భారతీయుల సంక్షేమం, భద్రతపై తమ ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. భారత వినియోగదారులపై భారం పడకుండా, చమురు లభ్యత, ధరలను నియంత్రించేందుకు దౌత్య పరంగా కృషి చేస్తున్నట్టు చెప్పారు. అలాగే పశ్చిమాసియాలో చిక్కుకున్న భారతీయులను వెనక్కి రప్పించేందుకు భారత్ అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని.

## మెడికల్ బోర్డు తక్షణమే నిర్వహించాలి...

టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్...




గోదావరిఖని//**మార్చి 09 (ఆకాంక్ష) :** సింగరేణి యాజమాన్యం తక్షణమే మెడికల్ బోర్డు నిర్వహించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తితో కలిసి ఆయన మాట్లాడారు.గత సంవత్సరం కాలంగా మెడికల్ బోర్డు నిర్వహించకపోవడం వల్ల వేలాది మంది కార్మికుల పిల్లలు ఉద్యోగ అవకాశాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతి నెలలో రెండు మెడికల్ బోర్డులు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో అత్యధిక ఎమ్మెల్యే స్థానాలు గెలిచామని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామిలు వెంటనే స్పందించి మెడికల్ బోర్డు ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు.ఏఐటీయూసీ ఐఎన్‌టీయూసీ వంటి సంఘాలు అధికారాన్ని అనుభవించడం తప్ప కార్మిక సమస్యలను పట్టించుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. గతంలో నిర్వహించిన మెడికల్ బోర్డుకు హాజరైన కార్మికులను సర్ఫేస్ విభాగానికి బదిలీ చేసి, భూగర్భంలో చేసే పాత పనిని కొనసాగించాలని ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి వారికి మళ్లీ వైద్య పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.సింగరేణి సంస్థకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బుద్ధ ప్రసాద్‌తో త్వరలో చర్చలు జరుపుతామని, సిఎండీ స్పందన ఆధారంగా భవిష్యత్ పోరాట కార్యక్రమాన్ని ప్రకటిస్తామని తెలిపారు. జాతీయ కార్మిక సంఘాలు, అలాగే మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హయాంలో కారుణ్య నియామకాల పేరిట కార్మిక కుటుంబాలకు వారసత్వ ఉద్యోగాలను కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్మిక కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించే అంశంపై అవసరమైతే కోర్టు తలుపులు కూడా తడతామని, డీజీఎంఎస్ అధికారులను కలుస్తామని తెలిపారు.ఈ విలేకరుల సమావేశంలో టీబీజీకేఎస్ సీనియర్ ఉపాధ్యక్షుడు నూనె కొమురయ్య, రాష్ట్ర నాయకులు అబ్బు శ్రీనివాసరెడ్డి, పాశం శ్రీనివాసరెడ్డి, భేతి చంద్రయ్య, పల్లె సురేందర్, వాసర్ల జోసెఫ్, జనగామ మల్లేష్, రొడ్డ సంపత్, మాసిడి సాయి చరణ్, వేణు, కే నాగేశ్వరరావు, అనిల్ రెడ్డి, కళాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లాలో ఐటీఐలో స్వల్పకాలిక కోర్సుల ప్రారంభం...

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనయే ప్రభుత్వ ధ్యేయం...

పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు...



పెద్దపల్లిటౌన్//**మార్చి 09 (ఆకాంక్ష) :**పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆరు నూతన స్వల్పకాలిక కోర్సులను ప్రారంభించారు. స్థానిక శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కోర్సులను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడం ద్వారా పరిశ్రమలకు అనుగుణమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.ఐటీఐల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు శిక్షణ అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఐటీఐల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చి ఆధునిక సౌకర్యాలు కల్పించామని తెలిపారు.



పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో యువతను తీర్చిదిద్దేందుకు ఈ కేంద్రాలు కీలకంగా మారుతాయని పేర్కొన్నారు.ఐటీఐ అభివృద్ధి కోసం కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల కింద రూ. 1.75 లక్షలను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే దాదాపు 50 వేల ఉద్యోగాలను భర్తీ చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిందని వెల్లడించారు.ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక రంగంలో ఉపాధి పొందాలని ఎమ్మెల్యే యువతకు పిలుపునిచ్చారు. స్వల్పకాలిక కోర్సుల ద్వారా విద్యార్థులు తక్కువ కాలంలోనే నైపుణ్యాలు అభ్యసించి ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నుగ్గిళ్ల మల్లయ్య, స్థానిక కౌన్సిలర్లు, కళాశాల అధ్యాపకులు వెంకట్ రెడ్డి, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జామ తోట రైతుకు నష్టపరిహారం చెల్లించాలి...

సిపిఐ, ఏపీ రైతు సంఘం...



వెల్దుర్తి//**మార్చి 09 (ఆకాంక్ష) :** కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం సూదేపల్లె గ్రామానికి చెందిన రైతు మాదిగ పెద్ద మాదన్నకు జరిగిన నష్టానికి ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ నాయకులు, ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు.వివరాల్లోకి వెళితే సూదేపల్లె గ్రామానికి చెందిన మాదిగ పెద్ద మాదన్న గత రెండు సంవత్సరాలుగా జామ తోట సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే కొంత మంది దుండగులు దురుద్దేశంతో జామ తోటకు నిప్పంటించడంతో



సుమారు 200 జామ చెట్లు మంటల్లో తగలబడి నాశనమయ్యాయి. ఈ ఘటనలో రైతుకు సుమారు రూ.50 వేల వరకు నష్టం జరిగినట్లు తెలిపారు.జామ తోటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న పేద రైతు తీవ్రంగా నష్టపోయాడని, ప్రభుత్వం వెంటనే స్పందించి తక్షణ నష్ట పరిహారం చెల్లించాలని వారు కోరారు.అదే విధంగా నాశనమైన జామ చెట్ల స్థానంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద ఉచితంగా జామ మొక్కలను మంజూరు చేసి రైతును ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మండలంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల గడ్డివాములు, పంట పొలాలు వంటి వ్యవసాయ ప్రమాదాల్లో నష్టపోయిన రైతులను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ఈ ఘటనపై మండల అధికారులు, జిల్లా అధికారులు వెంటనే స్పందించి నష్టపోయిన రైతుకు తగిన నష్టపరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు టి.కృష్ణ, డి.రాజు,చిన్నమాదులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వెల్దుర్తి ఐసిడిసిఎస్ ప్రాజెక్ట్‌కు గర్వకారణం...

సూపర్వైజర్ పద్మకు జిల్లా అవార్డు...



వెల్దుర్తి //**మార్చి 09 (ఆకాంక్ష) :** కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలంలో మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ పర్యవేక్షకురాలిగా అవార్డు అందుకున్న వెల్దుర్తి ప్రాజెక్ట్ సూపర్వైజర్ శ్రీమతి పద్మ కు అభినందన సభ ఘనంగా నిర్వహించారు. కర్నూలు జిల్లా మాతా-శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ పర్యవేక్షకురాలిగా ఎంపికైన శ్రీమతి పద్మ గారు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా వెల్దుర్తి ప్రాజెక్ట్ కార్యాలయంలో సిడిపిఓ లుక్ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా అవార్డు గ్రహీత శ్రీమతి పద్మ కు సిడిపిఓ లుక్ సార్ పూలమాల, శాలువాతో సన్మానం చేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సిడిపిఓ లుక్ మాట్లాడుతూ వెల్దుర్తి ప్రాజెక్టు తరఫున జిల్లా స్థాయిలో ఉత్తమ పర్యవేక్షకురాలిగా అవార్డు అందుకోవడం ఎంతో గర్వకారణమని అన్నారు. శ్రీమతి పద్మ గారు ఉద్యోగ విధుల్లో ఎంతో కష్టపడి, నిబద్ధతతో పనిచేస్తున్నారని, అందుకే ఈ అవార్డు ఆమెకు దక్కిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరెన్నో అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.అదేవిధంగా వెల్దుర్తి అంగన్వాడి వర్కర్స్ కూడా శ్రీమతి పద్మ కు అభినందనలు తెలియజేసి, ఆమె సేవలను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో వెల్దుర్తి అంగన్వాడి వర్కర్స్, సూపర్వైజర్లు మరియు ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

## శారద విద్యానికేతన్ పాఠశాలలో విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన...

విద్యార్థుల ప్రతిభకు ప్రశంసలు...



వెల్దుర్తి //**మార్చి 09 (ఆకాంక్ష) :** కర్నూలు జిల్లా, వెల్దుర్తి మండలంలోని శారద విద్యానికేతన్ పాఠశాలలో విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన (సైన్స్ ఎక్స్‌పో) ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ సైన్స్ ఎక్స్‌పోలో విద్యార్థులు రూపొందించిన 125 కి పైగా శాస్త్రీయ ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పర్యావరణ పరిరక్షణ, శాస్త్రీయ ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధి, వ్యవసాయానికి ఉపయోగపడే ప్రయోగాలు వంటి అనేక అంశాలపై విద్యార్థులు రూపొందించిన నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.ఈ ప్రదర్శనలో విజ్ఞాన శాస్త్రంతో పాటు భారతీయ సాంప్రదాయాల ప్రాముఖ్యతను తెలియజేసే అంశాలు కూడా చోటు చేసుకున్నాయి. విద్యార్థులు రామాయణం, మహాభారతం వంటి భారతీయ ఇతిహాసాలు, సనాతన ధర్మంలోని విలువలను ఆధునిక శాస్త్రీయ దృక్కోణంతో వివరించారు. అదేవిధంగా ముస్లిం మరియు క్రైస్తవ మతాలకు సంబంధించిన సాంస్కృతిక విలువలు, సామాజిక సందేశాలను కూడా తమ ప్రాజెక్టుల ద్వారా తెలియజేసి సామరస్య భావనను ప్రతిబింబించారు.ప్రతి ప్రాజెక్టును విద్యార్థులు ఎంతో స్పష్టంగా, వివరంగా వివరిస్తూ సందర్శకులను ఆకట్టుకున్నారు.కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులు, అతిథులు విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు.ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత మరియు భారతీయ సంస్కృతి పట్ల అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.



## ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నర్సింగ్ కళాశాల సిబ్బంది రోగులకు పండ్ల పంపిణీ...




నాగర్ కర్నూల్//**మార్చి 09 (ఆకాంక్ష) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపక సిబ్బంది సోమవారం నాడు సాధారణ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని డిప్యూటీ సూపర్డెంట్ డాక్టర్ వి.శేఖర్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.రవికుమార్ నాయక్ పండ్ల పంపిణీ ప్రారంభించారు. నర్సింగ్ కళాశాల విద్యార్థులు విద్యతో పాటు సేవాతత్వరత కలిగి ఉండడం మంచిదని అన్నారు.ఆస్పత్రిలోనీ పలు వార్డులలోని చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు,ఆసుపత్రి నర్సింగ్ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి పట్టణాన్ని 'స్వచ్ఛ పెద్దపల్లి'గా మారుద్దాం...

మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య...




పెద్దపల్లిటౌన్//**మార్చి 09 (ఆకాంక్ష) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా సోమవారం పెద్దపల్లి పట్టణంలో స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ప్రాంగణం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీని మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య జెండా ఊపి ప్రారంభించారు. పట్టణ ప్రధాన వీధుల మీదుగా సాగిన ఈ ర్యాలీ జెండా చౌరస్తా, మజీద్, అమర్ నగర్ చౌరస్తా మీదుగా జూనియర్ కాలేజీ మైదానం వరకు కొనసాగింది.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ప్రజలు తమ ఇళ్ల నుండి వచ్చే చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి అందించాలని సూచించారు. ఇలా చెత్తను వేరు చేసి ఇవ్వడం ద్వారా పట్టణాన్ని మరింత పరిశుభ్రంగా మార్చుకోవచ్చని అన్నారు.ఎమ్మెల్యే విజయ రమణ రావు (విజ్జన్న) సహకారంతో పెద్దపల్లి పట్టణం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు సక్రమంగా అమలు కావాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అందరి సహకారంతోనే "స్వచ్ఛ పెద్దపల్లి" లక్ష్యాన్ని సాధించగలమని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు మోలుగురి కమల్, నల్లాల పద్మ సురేష్, అక్కేపల్లి సుజాత క్రాంతి, మున్సిపల్ మేనేజర్ లింగయ్య, అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్, టౌన్ ప్లానింగ్ అధికారి నరేష్, మెప్మా టీఎంసీ స్వప్నతో పాటు మున్సిపల్ మరియు మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ప్రిజం విద్యాసంస్థ దశాబ్ది వార్షికోత్సవ వేడుకలు...

95 టీంల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు....



నాగర్ కర్నూల్//**మార్చి 09 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రిజం విద్యా సంస్థను స్థాపించి పది సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా దశాబ్ది వేడుకలు ఫంక్షన్ హాల్లో పాఠశాల ప్రిన్సిపాల్ తాళ్ల నిరంజన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థి ఉపాధి దిశగా వెల్లుతూ సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు.ఈ వేడుకలలో విద్యార్థుల యొక్క ప్రతిభ పాటవాలు ఆట ,పాట ,నాట్యరీతిలను కనబరుస్తూ 95 టీంలతో వచ్చినటువంటి విద్యార్థులను, పోషకులను ఆనంద ఉత్సవాలలో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు వారి శాస్త్ర సాంకేతిక జ్ఞాన నివేదికలను అద్భుతంగా ప్రదర్శించారు.ఈ వేడుకలలో ప్రిజం స్కూల్ యాజమాన్యం కృష్ణయ్య ,వైస్ ప్రిన్సిపాల్ దాసర్ల దేవేందర్,స్వప్న పాల్గోని విద్యార్ధులను అభినందించారు. అనంతరం సామూహికంగా భోజనాలు చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దేవేందర్,పవన్, రామకృష్ణ, సలీమ్, భలిందర్, భరత్, వసంత,విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల్లో 5గురికి గాయాలు...





వెల్దుర్తి//**మార్చి 09 (ఆకాంక్ష) :** కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం అయిన వెల్దుర్తి మండలం జాతీయ రహదారి 44 పై సోమవారం వేరువేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదు మంది గాయపడ్డారు. ప్యాపిలి మండలం నల్ల మేకల పల్లి నుంచి అనారోగ్యానికి గురైన హాజీపీరాను ఆటోలో కర్నూల్ తీసుకొని వెళుతుండగా భీమలింగేశ్వరస్వామి ఆలయం సమీపంలో మల్లేపల్లి బస్ స్టాప్ వైపు నుంచి జాతీయ రహదారిపైకి ద్విచక్రవాహనం లో మల్లేపల్లి గోపాల్, లద్దగిరి రమేష్ అనే ఇద్దరు వస్తున్నారు. వీరి మోటార్ బైక్ నీ ఆ ఆటో ఢీకొంది. దీంతో బైక్ పై ఉన్న ఇద్దరికీ తీవ్ర రక్తగాయాలు అయ్యాయి.ఆటోలో ఉన్న హాజీపీరా తలకు గాయాలయ్యాయి. గాయపడ్డ ముగ్గురిని హైవే పోలీసులు, 108 అంబులెన్సులో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అదే విధంగా వెల్దుర్తికి చెందిన సురేష్ తన ఆటోలో బొమ్మిరెడ్డి పల్లెకు ప్రయాణికులను ఎక్కించుకొని వదిలి తిరిగి వెల్దుర్తి కి బయలుదేరాడు.బస్ స్టాప్ లో ఉన్న భార్యాభర్తలను వెల్దుర్తికి వస్తారంటే ఎక్కించుకున్నాడు. అయితే ఆమెజాన్ సమీపంలో ఆ ఆటోను గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. దీంతో ఆటో కింద పడి ఆటో డ్రైవర్ సురేష్,భర్త జయన్న గాయపడ్డాడు. వీరిని హైవే పోలీసులు హైవే అంబులెన్సులో కర్నూలు కు తరలించారు. ఈ ప్రమాదాలపై వెల్దుర్తి ఎస్సై నరేష్ విచారణ చేపట్టారు.



## విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నేడు మహా ధర్నా...



నాగర్‌కర్నూల్ టౌన్//**మార్చి 09 (ఆకాంక్ష) :** తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నేడు ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని టీజీఎస్పీడీసీఎల్ రాష్ట్ర కార్యాలయం ముందు మింట్ కాంపౌండ్ వద్ద మహా ధర్నా నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ మహా ధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టిజన్ కార్మికులు భారీగా తరలివచ్చి పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 20 వేల మంది ఆర్టిజన్ కార్మికులు విద్యుత్ శాఖలో పనిచేస్తున్నప్పటికీ వారికి ఇప్పటికీ పూర్తి స్థాయి హక్కులు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టిజన్ కార్మికులకు వెంటనే ఏపీ ఎస్సీబీ రూల్స్ అమలు చేసి, వారి విద్యార్హతలకు అనుగుణంగా కన్వర్షన్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ప్రస్తుతం అన్‌మ్యాన్‌గా పనిచేస్తున్న కార్మికులను కూడా ఆర్టిజన్ కార్మికులుగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు.విద్యుత్ శాఖలో ఒకే సంస్థలో పనిచేస్తున్నప్పటికీ వేర్వేరు నిబంధనలు అమలు చేయడం అన్యాయమని నాయకులు పేర్కొన్నారు. "ఒకే సంస్థ ఒకే రూల్స్" విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. ఈ మహా ధర్నా ద్వారా కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కారం సాధించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు కొంకలి లోకేష్, మంగి విల్సన్, నాగర్‌కర్నూల్ జిల్లా జేఏసీ కన్వీనర్ మిద్దె శ్రీనివాసులు, ఆర్టిజన్ కార్మికులు శంకర్, రాజులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టిజన్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల ఐక్యతతోనే హక్కులు సాధ్యమవుతాయని, అందరూ ఐక్యంగా ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. నేడు నిర్వహించనున్న ఈ మహా ధర్నా ద్వారా కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు.

## అవయవదానం చేసి నలుగురికి పునర్జన్మ ఇచ్చిన రైతు కుటుంబం...



ఓదెల//**మార్చి 09 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలానికి చెందిన రైతు బుద్దె పోశెట్టి ప్రమాదవ శాత్తు మృతిచెందినా, ఆయన కుటుంబ సభ్యులు చూపిన మానవతా విలువలు నలుగురి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాయి. అవయవదానం ద్వారా నలుగురు బాధితులకు పునర్జన్మ కల్పిస్తూ ఈ రైతు కుటుంబం సమాజానికి ఆదర్శంగా నిలిచింది. వివరాల ప్రకారం ఓదెలకు చెందిన రైతు బుద్దె పోశెట్టి రెండు రోజుల క్రితం బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆయనను హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే వైద్యుల ప్రయత్నాలు ఫలించకపోవడంతో సోమవారం ఆయన బ్రెయిన్ డెత్‌కు గురయ్యారు.ఈ సందర్భంలో దొమ్మటి పోశెట్టి, ఓదెల మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి అవయవ దానం యొక్క ప్రాముఖ్యతపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. తీవ్ర దుఃఖంలో ఉన్నప్పటికీ సమాజహితం దృష్ట్యా కుటుంబ సభ్యులు గొప్ప మనసుతో అవయవ దానానికి అంగీకరించారు.దీంతో బుద్దె పోశెట్టి రెండు మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు వంటి నాలుగు అవయవాలను దానం చేయడంతో నలుగురు బాధితులకు ప్రాణాధారం లభించింది. ఆయన మరణానంతరం కూడా నలుగురికి జీవం పోసిన ఈ ఘటన స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది.ఈ సందర్భంగా భార్య రమ, కుమారులు రాకేష్‌దివ్య, కార్తీక్‌శిరీష, కూతురు పావని సంతోష్, మనుమలు మనవరాళ్లు మన్విత్, ఆద్య, రక్షిత్, ధ్రువ, విరాట్ కుటుంబ సభ్యులను ఓదెల గ్రామ మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, రాజేంద్ర ప్రసాద్, క్యాతం మల్లేశం, కొంద్ర వేణు, అల్లం సతీష్, యాతం వెంకటేశ్వర్లు, మెర్గు సారంగం అభినందించారు.అలాగే సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, గౌరవ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారులు రమేష్, ప్రచార కార్యదర్శి వాసు, జిల్లా గౌరవ అధ్యక్షులు చంద్రమౌళి కుటుంబ సభ్యులను అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు. అవయవదానం ద్వారా ప్రాణాలను కాపాడే గొప్ప సందేశాన్ని ఈ రైతు కుటుంబం సమాజానికి అందించిందని వారు కొనియాడారు. ఈ ఘటన సమాజంలో అవయవదానం పట్ల అవగాహన పెంచేలా మారాలని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం...

### పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్...



నిజామాబాద్//మార్చి 09 **(ఆకాంక్ష) :** నిజామాబాద్ జిల్లా జర్నలిస్టుల చిరకాల కోరిక అయిన ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు. జర్నలిస్టులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తిస్తున్నదని, ముఖ్యంగా వారి ఆరోగ్య భద్రతకు సంబంధించిన హెల్త్ కార్డుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ఆయన తెలిపారు.నిజామాబాద్‌లో నిర్వహించిన ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మీడియా సమాజంలో కీలక పాత్ర పోషిస్తోందని, ప్రజలకు నిజమైన సమాచారం చేరవేయడం జర్నలిస్టుల ప్రధాన బాధ్యత అని అన్నారు.వార్తల సేకరణలో వాస్తవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, పేదల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే గొంతుకగా జర్నలిస్టులు నిలవాలని ఆయన సూచించారు. టీఆర్పీ రేటింగ్స్ కోసం కాకుండా సమాజ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిజమైన వార్తలను ప్రజలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిగా మీడియా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు.జర్నలిస్టుల సంక్షేమం కోసం తాను ఎమ్మెల్సీగా ఎప్పటికీ మద్దతు ఇస్తానని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీ అంశంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించేలా మాట్లాడతామని చెప్పారు. త్వరలోనే ఈ సమస్యపై నిర్ణయం తీసుకునేలా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్తా, మేయర్ ఉమారాణి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హుందాన్, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

## సహజీవన భాగస్వామిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన వ్యక్తి...

### బెంగళూరు నగరంలో దారుణ ఘటన...

### మహిళతోపాటు ఆమె తల్లిదండ్రులకు తీవ్ర గాయాలు, నిందితుడు అరెస్ట్..




బెంగళూరు//మార్చి 09 **(ఆకాంక్ష) :** కర్ణాటక రాజధాని బెంగళూరులో దారుణ ఘటన చోటుచేసుకుంది. స్కూటీ ఇవ్వలేదనే కోపంతో సహజీవనం చేసిన మహిళపై ఒక వ్యక్తి పెట్రోల్ పోసి నిప్పంటించిన సంఘటన సంచలనం రేపింది. ఈ ఘటనలో మహిళతోపాటు ఆమె తల్లిదండ్రులు కూడా తీవ్రంగా కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిని లేఅవుట్ ప్రాంతానికి చెందిన 32 ఏళ్ల పాండురంగకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా 27 ఏళ్ల సుమలతతో పరిచయం ఏర్పడింది. సుమలతకు ఇప్పటికే వివాహం జరిగి ఇద్దరు కుమారులు ఉన్నప్పటికీ భర్తతో విభేదాలు రావడంతో అతడిని వదిలి పాండురంగతో కలిసి నివసించడం ప్రారంభించింది. గత ఏడాది కాలంగా ఇద్దరూ సహజీవనం కొనసాగించగా వారికి ఒక కుమార్తె కూడా జన్మించింది.అయితే ఇటీవల ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరగడంతో సుమలత పాండురంగను వదిలి తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. ఆమె తారబనహల్లి ప్రాంతంలో తన తల్లిదండ్రులతో కలిసి నివసిస్తూ ఇంటి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది.ఈ క్రమంలో సాయంత్రం సుమారు 6.30 గంటల సమయంలో పాండురంగ ఆమె ఇంటికి వెళ్లాడు. సుమలత వద్ద ఉన్న స్కూటీ తాళాలు ఇవ్వాలని కోరాడు. అయితే ఆమె నిరాకరించడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సుమలత తల్లిదండ్రులు జోక్యం చేసుకొని గొడవను ఆపేందుకు ప్రయత్నించారు.దీంతో మరింత ఆగ్రహానికి గురైన పాండురంగ ముందుగానే తీసుకువచ్చిన పెట్రోల్ బాటిల్‌ను తీసి సుమలతతోపాటు ఆమె తల్లిదండ్రులపై పోసి నిప్పంటించాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. మంటలు వ్యాపించడంతో బాధితులు తీవ్రంగా గాయపడ్డారు.ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి మంటలను ఆర్పి గాయపడిన ముగ్గురిని సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు అక్కడ చికిత్స పొందుతున్నట్లు వైద్యులు తెలిపారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరారైన నిందితుడు పాండురంగను కొద్దిసేపట్లోనే గుర్తించి అరెస్ట్ చేశారు. అతడిపై హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వ్యక్తిగత విభేదాలు ఈ స్థాయికి చేరుకోవడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసును అన్ని కోణాల్లో విచారిస్తూ పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.

## ఐతరాజుపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం...

### 150 మందికి పరీక్షలు, 32 మందికి శస్త్రచికిత్సకు తరలింపు...



సుల్తానాబాద్// **మార్చి 09 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం ఐతరాజుపల్లి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దీకొండ భూమేష్ కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జూపల్లి తిరుమల్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో రేకుర్తి కంటి దవాఖాన వైద్య బృందం పాల్గొని గ్రామ ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించింది.ఈ వైద్య శిబిరంలో దాదాపు 150 మంది గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 32 మందికి కంటి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. శస్త్ర చికిత్స కోసం వారిని రేకుర్తి కంటి దవాఖానకు ప్రత్యేక బస్సులో తరలించారు. గ్రామ ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించడం తో పాటు అవసరమైన వారికి శస్త్రచికిత్స సౌకర్యం కల్పించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సుల్తానాబాద్ ద్వారా సమాజ సేవా కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్యం కోసం ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రెటరీ ఎర్రబెల్లి సుధీర్ రావు, కోశాధికారి తమ్మనవేని సతీష్, వైస్ ప్రెసిడెంట్ పూసాల సాంబమూర్తి, సభ్యులు కన్న రమేష్, ఆడెపు సదానందం, ఐతరాజుపల్లి ఉపసర్పంచ్ దాసరి మధుసూదన్ రెడ్డి, వార్డు సభ్యులు గుడాల మారుతి, దాసరి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారు.

## నల్గొండలో బీభత్సం సృష్టించిన కారు...

### ఇద్దరికి తీవ్ర గాయాలు...




నల్గొండ//**మార్చి 09 (ఆకాంక్ష) :** నల్గొండ పట్టణంలో ఒక కారు బీభత్సం సృష్టించిన ఘటన కలకలం రేపింది. మితిమీరిన వేగంతో దూసుకొచ్చిన కారు జాతీయ రహదారిపై వెళు_న్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో పాటు రోడ్డుపై శుభ్రపరిచే పనులు చేస్తున్న మున్సిపల్ కార్మికురాలిని కూడా బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం పట్టణంలోని అన్లిమిటెడ్ షాపింగ్ మాల్ ఎదుటుగా వెళ్లే జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మితిమీరిన వేగంతో వచ్చిన కారు ఒక్కసారిగా అదుపు తప్పి ముందుగా వెళ్తున్న స్కూటీని ఢీకొట్టింది. అనంతరం అక్కడే రహదారి శుభ్రపరిచే పనులు చేస్తున్న మున్సిపల్ మహిళా కార్మికురాలిని ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడిపోయారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ నల్గొండకు తరలించారు. స్కూటీపై వెళ్తున్న యువకుడి తలకు తీవ్ర గాయాలు కావడంతో అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం అతడిని ఐకాన్ హాస్పిటల్ కు తరలించారు.ఇక మున్సిపల్ కార్మికురాలి పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉందని సమాచారం. ప్రమాదంలో ఆమె రెండు కాళ్లు విరిగిపోయినట్లు వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో అక్కడికక్కడే తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.కారు డ్రైవర్ నిర్లక్ష్యం, మితి మీరిన వేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. రంగారెడ్డి జిల్లాలో కారు బీభత్సం...

## మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో పలు ద్విచక్రవాహనాలపైకి దూసుకెళ్లిన వాహనం...

రంగారెడ్డి//**మార్చి 09 (ఆకాంక్ష) :** రంగారెడ్డి జిల్లా జిల్లాలో సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.మితి మీరిన వేగంతో దూసుకొచ్చిన ఓ కారు పలు ద్విచక్రవాహనాలను ఢీకొట్టి బీభత్సం సృష్టించిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనతో కొంతసేపు ఆ ప్రాంతంలో భయాందోళనలు నెలకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మెహిఫిల్ హోటల్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం వేళ ఒక కారు మితిమీరిన వేగంతో దూసుకొచ్చింది. నియంత్రణ కోల్పోయిన కారు రోడ్డుపై నిలిపి ఉంచిన పలు ద్విచక్రవాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో అక్కడ నిలిపి ఉంచిన కొన్ని బైకులు తీవ్రంగా దెబ్బతిన్నాయి.అయితే ఈ ఘటన తర్వాత కూడా కారు డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా అలాగే ముందుకు వెళ్లడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఢీకొట్టిన బైక్‌లలో ఒకటి కారుకు ఇరుక్కుపోయి దాదాపు రెండు కిలోమీటర్ల వరకు కారుతో పాటు ఈడ్చుకెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రోడ్డుపై నుంచి బైక్‌ను లాగుకుంటూ కారు వెళ్లడం చూసి స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు.దీంతో కొంతమంది స్థానికులు కారును వెంబడించి చివరకు అడ్డగించి ఆపారు. అనంతరం కారులో ఉన్న డ్రైవర్‌ను బయటకు తీసి ప్రశ్నించగా అతను మందు మత్తులో ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు.డ్రైవర్ ప్రవర్తనతో ఆగ్రహించిన స్థానికులు కొంతసేపు అక్కడ ఆందోళన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై సమాచారం అందుకున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికుల వివరాలు సేకరించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.ప్రమాదంలో ధ్వంసమైన ద్విచక్రవాహనాలను పరిశీలించారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో పెద్దగా ప్రాణ నష్టం జరగలేదని పోలీసులు తెలిపారు. అయితే వాహనాలకు మాత్రం గణనీయమైన నష్టం వాటిల్లినట్లు వెల్లడించారు.స్థానికుల ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడిపాడా లేదా అనే విషయంపై కూడా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.మితిమీరిన వేగంతో, మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పోలీసులు హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని, మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## నర్సింహులపేటలో ఎంపీడీవో కార్యాలయంలో అధికారుల గైర్హాజరు...



మహబూబాబాద్//**మార్చి 09 (ఆకాంక్ష) :** మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారుల సమయపాలన లోపం ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. సోమవారం ఉదయం 11.30 గంటలు దాటినా కార్యాలయానికి ఒక్క అధికారి కూడా హాజరుకాకపోవడంతో అక్కడికి వచ్చిన ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వివిధ గ్రామాల నుంచి ప్రభుత్వ పనుల కోసం వచ్చిన ప్రజలు గంటల తరబడి కార్యాలయం ఎదుట వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పింఛన్లు, ఉపాధి హామీ పథకం, గ్రామాభివృద్ధి పనులు, ధృవపత్రాల కోసం కార్యాలయాన్ని ఆశ్రయించినప్పటికీ అధికారులు లేకపోవడంతో నిరాశతో వెనుదిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయంలో తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు మాత్రమే హాజరై ఉండగా, కీలక బాధ్యతలు నిర్వహించే అధికారులు మాత్రం కార్యాలయానికి రాకపోవడం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఎంపీడీవో కార్యాలయంలో కీలక పాత్ర పోషించే ఎంపీడీవో, ఎంపీఓ, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ వంటి అధికారులు కూడా సమయానికి కార్యాలయానికి రాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలన తప్పనిసరి అయినప్పటికీ, నర్సింహులపేట ఎంపీడీవో కార్యాలయంలో మాత్రం అది కేవలం పేరుకే మిగిలిపోయిందని మండిపడుతున్నారు.ఇదే పరిస్థితి గత కొద్ది రోజులుగా కొనసాగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు సమయానికి రాకపోవడం వల్ల తమ పనులు రోజులు తరబడి వాయిదా పడుతున్నాయని, పలు సార్లు కార్యాలయానికి తిరుగుతూ ఇబ్బందులు పడాల్సి వస్తోందని వారు తెలిపారు. గ్రామాల నుంచి దూరప్రాంతాల నుంచి వచ్చేవారు రవాణా ఖర్చులు భరించి కార్యాలయానికి వచ్చినప్పటికీ అధికారులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.ఈ విషయంపై పలుమార్లు కార్యాలయ సిబ్బందిని, అధికారులను వివరణ కోరినా సరైన సమాధానం ఇవ్వకుండా పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యతను విస్మరించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.అధికారులు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే భవిష్యత్తులో కార్యాలయం ఎదుట నిరసనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఇద్దరు ఆర్‌ఎస్సైలు...



హైదరాబాద్//**మార్చి 09 (ఆకాంక్ష) :** సైబర్ క్రైం కేసులో అరెస్టు చేయకుండా ఉండేందుకు ఫిర్యాదుదారుడి నుంచి లంచం డిమాండ్ చేసి తీసుకుంటూ ఇద్దరు ఆర్ఎస్సైలు అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కిన ఘటన సంచలనంగా మారింది. తెలంగాణ యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ) అధికారులు నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో ఈ అవినీతి వ్యవహారం బహిర్గతమైంది. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీ నగర్ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఆర్ఎస్సైలు ప్రమోద్ గౌడ్, జటావత్ బాబు నాయక్‌లు ఒక సైబర్ క్రైం కేసులో నిందితుడిని అరెస్టు చేయకుండా ఉండేందుకు ఫిర్యాదు దారుడి నుంచి లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. కేసులో ఉపశమనం కల్పిస్తామని చెప్పి రూ. లక్ష రూపాయలు ఇవ్వాలని వారు ఒత్తిడి తెచ్చినట్లు ఫిర్యాదు అందింది.ఈ విషయాన్ని బాధితుడు ఏసీబీ అధికారులకు తెలియజేయడంతో వారు ముందస్తు ప్రణాళికతో ఉచ్చుపన్ను ఏర్పాటు చేశారు. సోమవారం ఎల్‌బీ నగర్ చౌరస్తా వద్ద ఫిర్యాదుదారుడి నుంచి రూ.1 లక్ష నగదు తీసుకుంటున్న సమయంలో ఆర్ఎస్సై జటావత్ బాబు నాయక్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ దాడులను ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో అధికారులు నిర్వహించారు. లంచం స్వీకరిస్తున్న సమయంలో పట్టుబడిన నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఈ వ్యవహారంలో ప్రమోద్ గౌడ్ పాత్ర కూడా ఉన్నట్లు గుర్తించి ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న నగదు, ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.అరెస్టు చేసిన ఇద్దరు ఆర్ఎస్సైలను వైద్య పరీక్షల అనంతరం నాంపల్లి లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరు పరిచారు. ఈ ఘటనతో పోలీస్ శాఖలో మరోసారి అవినీతి వ్యవహారాలు బయట పడటంతో చర్చనీయాంశంగా మారింది. బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్న అధికారులు ప్రజల విశ్వాసాన్ని ద్రోహం చేస్తూ లంచాలు తీసుకోవడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు ముఖ్య సూచనలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు లేదా అధికారులు ఎవరైనా తమ విధులకు విరుద్ధంగా లంచం డిమాండ్ చేస్తే వెంటనే అవినీతి నిరోధక శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇందుకోసం 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అలాగే 9440446106 వాట్సాప్ నంబర్ ద్వారా కూడా ఆధారాలతో కూడిన ఫిర్యాదులు పంపవచ్చని వెల్లడించారు.ప్రజల సహకారంతోనే అవినీతి నిర్మూలన సాధ్యమవుతుందని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. అధికారులు లంచం అడిగిన సందర్భాల్లో భయపడకుండా వెంటనే సమాచారమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. ఈ ఘటనతో సైబర్ క్రైం కేసు పేరుతో లంచం డిమాండ్ చేస్తున్న పోలీసుల వ్యవహారం వెలుగులోకి రావడం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది.

## కల్తీ వ్యాపారులపై పీడీ యాక్ట్ పెట్టాలి: రాజనాల శ్రీహరి డిమాండ్...



వరంగల్//**మార్చి 09 (ఆకాంక్ష) :** రోజురోజుకూ పెరుగుతున్న కల్తీ దందాలను ప్రభుత్వం వెంటనే అరికట్టాలని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి డిమాండ్ చేశారు. కల్తీ చేసే వారు ఎంతటి వారైనా వారిపై పీడీ యాక్ట్ పెట్టి కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.కల్తీ చేసే వారిని పట్టుకుని డబ్బులు తీసుకుని వారిని విడుదల చేసే అధికారులు ఉన్నా, అలాగే ఎంతటి రాజకీయ నాయకులైనా వారి ప్రమేయం ఉన్నా వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.ప్రస్తుతం చిన్న చిన్న దుకాణాల దగ్గర నుంచి పాలు, టీ పొడి, అల్లం పేస్ట్, వెల్లుల్లి పేస్ట్, వంట నూనెతో పాటు అనేక నిత్యావసర వస్తువుల్లో కల్తీ జరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రజలు రోజూ వాడే కొన్ని మందుల్లో కూడా కల్తీ జరుగుతోందని సమాచారం వస్తోందని పేర్కొన్నారు.ఇలాంటి కల్తీ వస్తువులను తయారు చేసే కేంద్రాలు కూడా అనేకం ఉన్నాయని, వాటిని వెంటనే గుర్తించి నియంత్రించకపోతే రాబోయే రోజుల్లో ప్రజలు తీవ్రమైన అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం ప్రజలను బాధిస్తున్న క్యాన్సర్ వంటి వ్యాధులు కూడా ఇలాంటి కల్తీ ఆహార పదార్థాల వల్లే వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారని ఆయన తెలిపారు.అందుకే వెంటనే ఫుడ్ సేఫ్టీ డిపార్ట్మెంట్లో ఉన్నతాధికారులను నియమించి, కల్తీ వ్యాపారం చేసే వారందరినీ పట్టుకుని వారిపై పీడీ యాక్ట్ పెట్టి కఠినంగా శిక్షించాలని రాజనాల శ్రీహరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రజల ఆరోగ్యం చాలా ముఖ్యమైందని, ప్రభుత్వం వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ద

## పేద విద్యార్థికి పుణ్య దంపతుల విద్యా సేవ...




హైదరాబాద్//**మార్చి 09 (ఆకాంక్ష) :** హైదరాబాద్ బోరబండ కు చెందిన ధరణికోట శివరామకృష్ణ(60) వృత్తి రీత్యా తెలుగు లో రైటర్. సినిమాలకు డైలాగులు వ్రాయడంతో పాటు సినిమా ఆఫర్లు లేని సందర్భాలలో రాజకీయ నాయకుల ప్రచారానికి సంబంధించి ఇతరత్రా వ్రాయడం ద్వారా వచ్చిన వారితోషికంతో తన కుటుంబ పోషణ చేస్తున్నారు. వారి ఏకైక కుమారుడు భరత్ పాలిటెక్నిక్ డిప్లమోలో ఉత్తీర్ణుడైన అనంతరం ఇబ్రహీంపట్నంలో ఉన్న ఏవిఎన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ లో మెకానికల్ ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం లో చేరి (లేటరల్ ఎంట్రీ) చదువుతున్నాడు. తండ్రి శివరామ ప్రసాద్ కు ఈమధ్య అవకాశాలు సరిగా లేక చాలీచాలని ఆదాయంతో కాలేజ్ ఫీజు చెల్లించడం కష్టమైన తరుణంలో సహాయం కొరకు వెస్సో ట్రస్ట్ ను సంప్రదించారు. వెస్సో ట్రస్ట్ ద్వారా విద్యార్థి ఆర్థిక ఇబ్బందిని తెలుసుకున్న గౌరవ దాతలు నందిగామ రాధా రాణి కృష్ణమాచారి (అమెరికా నుండి ఇండియా తిరిగి వచ్చిన ఎన్నారై) మరియు వారి తల్లి కొలవెన్ను లక్ష్మీ కమల, విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ (హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్) తమ హైదరాబాద్ వికాసపురి నివాసంలో మొదటి తడవ 15000 పదిహేను వేల రూపాయలు మరియు రెండవ తడవ 14000 పద్నాలుగు వేల రూపాయలు, మొత్తంగా 29,000/- ఇరవై తొమ్మిది వేల రూపాయలు చెక్కుల రూపంలో విద్యార్థి భరత్ తండ్రి శివరామకృష్ణ కు అందజేశారు. ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ వెస్సో ట్రస్ట్ సామాజిక సేవలకు విశేషముగా మద్దతు ఇస్తున్న రాధా రాణి సోదరులు కొలవెన్ను పరబ్రహ్మ సుధాకర్ మరియు ఇతీ. నందిగామ కృష్ణమాచారి, రాధా రాణి దంపతులకు హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

## భగత్ సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి..

### రామగుండం ఎమ్మెల్యే కు వినతి పత్రం అందజేసిన ఏఐఎస్ఎఫ్ శ్రేణులు..

### ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం



గోదావరిఖని టౌన్//**మార్చి 09 (ఆకాంక్ష) :** స్వాతంత్ర సమరయోధుడు షహీద్ భగత్ సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేయడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ...భారత స్వాతంత్ర్య సమర యోధుడు, ప్రఖ్యాత ఉద్యమకారుడు,ఢిల్లీ వీధిలో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలను చైతన్య పరిచి,విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాన్ని ఇచ్చింది కూడా భగత్ సింగే అని ఆయన అన్నారు.భారత స్వాతంత్ర్యోద్యమం లో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవకారులలో అతను ఒకడు."ఇంక్విలాబ్ జిందాబాద్" నినాదంతో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా,మాతృదేశ విముక్తి కోసం పోరాడి, నూనుగు మీసాల వయసులో చిరునవ్వుతో ఉరికంబాన్ని ముద్దాడి అమరుడైన విప్లవ వీర కిషోరం భగత్ సింగ్ విగ్రహాన్ని వెంటనే రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఏర్పాటు చేయాలని రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ని కోరగా సానుకూలంగా స్పందించారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మాతంగి సాగర్,గుండ్ల లక్ష్మీప్రసన్న,అను సాయి,జశ్వంత్,అభి,చైత్ర తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ జిల్లా గుడ్ల నర్వ గ్రామంలో

## అండర్ డ్రైనేజీ పనులు వేగవంతం....



నాగర్‌కర్నూల్ టౌన్//**మార్చి 09 (ఆకాంక్ష) :** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల పరిధిలోని గుడ్ల నర్వ గ్రామంలో అండర్ డ్రైనేజీ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. గ్రామ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా చేపట్టిన ఈ పనులు ప్రస్తుతం ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన మట్టి, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే పనులను గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. గ్రామంలో పరిశుభ్రతను పెంపొందించడం,ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా గుడ్ల నర్వ గ్రామ సర్పంచ్ లేట్ల బాలస్వామి మాట్లాడుతూ గ్రామంలో గత రెండు మూడు సంవత్సరాలుగా డ్రైనేజీ కాలువల్లో మట్టి, చెత్త పేరుకు పోవడంతో నీరు నిల్వ ఉండే సమస్య తీవ్రంగా మారిందన్నారు. దీంతో గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కారం కోసం అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.డ్రైనేజీ కాలువలను పూర్తిగా శుభ్రపరచడం ద్వారా వర్షపు నీరు మరియు వాడుక నీరు సులభంగా పారిపోతుందని ఆయన చెప్పారు. గ్రామంలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని వివరించారు. నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు విపరీతంగా పెరిగి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఆయన తెలిపారు.దోమల ద్వారా వ్యాపించే మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు గ్రామ ప్రజలకు ప్రమాదంగా మారే అవకాశముందని పేర్కొన్నారు. అందుకే ముందస్తు జాగ్రత్తగా కాలువలను శుభ్రపరచడం, అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటి చర్యలను చేపడుతున్నామని వివరించారు. ఈ పనులు పూర్తయితే గ్రామంలో పరిశుభ్రత పెరిగి ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో పరిశుభ్రత కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు.అందుకే తాత్కాలిక పరిష్కారాలకే పరిమితం కాకుండా శాశ్వత పరిష్కారం కోసం అండర్ డ్రైనేజీ పనులను చేపట్టామని చెప్పారు. గ్రామాన్ని శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచేందుకు పంచాయతీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు.ఇక గ్రామంలో రహదారుల అభివృద్ధి పనులను కూడా చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామంలోని ముఖ్య వీధుల్లో రహదారులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆయన సూచించారు.చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. అండర్ డ్రైనేజీ పనులు పూర్తయిన తర్వాత గ్రామంలో నీటి నిల్వ సమస్యలు పూర్తిగా తగ్గిపోతాయని తెలిపారు. గ్రామ అభివృద్ధి దిశగా తీసుకుంటున్న ఈ చర్యలను గ్రామ ప్రజలు స్వాగతిస్తున్నారు. పంచాయతీ చేపడుతున్న పనులను వారు అభినందిస్తూ, గ్రామంలో పరిశుభ్రత పెంపొందించేందుకు తాము కూడా సహకరిస్తామని తెలిపారు. గ్రామంలో అండర్ డ్రైనేజీ పనులు పూర్తయితే పరిశుభ్రత మరింత మెరుగు పడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## తొలిసారిగా సీఈసీపై అభిశంసన తీర్మానం నోటీసు రెడీ చేసిన విపక్షాలు- ఈ వారంలోనే సమర్పించే ఛాన్స్!

### సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానం- సీఈసీ పదవి విలువను తగ్గించేలా వ్యవహరించడమే కారణం!

మన దేశంలోనే తొలిసారిగా భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశ పెట్టేందుకు విపక్ష పార్టీలు రెడీ అవుతున్నాయి. ఇందుకు సంబంధించిన నోటీసు ముసాయిదా ఇప్పటికే సిద్ధమైందని, దీన్ని ఈ వారంలోనే లోక్‌సభ స్పీకర్ లేదా రాజ్యసభ ఛైర్మన్‌కు సమర్పించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అభిశంసన నోటీసు తయారీ ప్రక్రియలో భాగమైన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ సీనియర్ ఎంపీ ఒకరు ఈ వివరాలను తెలిపారంటూ పీటీఐ వార్తాసంస్థ సోమవారం ఒక కథనాన్ని ప్రచురించింది. సీఈసీ పదవి నుంచి జ్ఞానేశ్‌ను తొలగించాలనే డిమాండ్‌తో కూడిన అభిశంసన తీర్మానం విషయంలో విపక్షాలన్నీ 100 శాతం కలిసికట్టుగా పనిచేస్తున్నాయని ఆ ఎంపీ తెలిపారు. భావసారూప్య పార్టీలన్నీ కలిసి సీఈసీ అభిశంసన నోటీసు, ఇతర ప్రణాళికలన్నీ సిద్ధం చేశాయని ఆయన చెప్పారు. పార్లమెంటు ఉభయ సభల్లో ఈ నోటీసును ప్రవేశ పెట్టే విషయంలోనూ ఒక జట్టులా పనిచేయాలని విపక్షాలు నిర్ణయించాయని టీఎంసీ ఎంపీ వెల్లడించారు. సీఈసీ అనే గొప్ప పదవి విలువను తగ్గించేలా జ్ఞానేశ్ కుమార్ వ్యవహరించారని ఆయన ఆరోపించారు. ఇక ఈ అభిశంసన నోటీసుకు పార్లమెంటులో మద్దతు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. విపక్ష ఇండియా కూటమిలోని ఇతర పార్టీలూ ఇందుకు .

## నాగ్‌సాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో

# ఘనంగా స్వయంపాలన దినోత్సవం...



మెదక్//**మార్చి 09 (ఆకాంక్ష) :** మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నాగ్‌సాన్‌పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు, బాధ్యతాభావం పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు వివిధ హోదాల్లో బాధ్యతలు స్వీకరించి పాఠశాల కార్యక్రమాలను నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఐదవ తరగతి విద్యార్థులు పాఠశాల పరిపాలనను నిర్వహిస్తూ తమ ప్రతిభను ప్రదర్శించారు. డీఈఓగా అశ్విత, ఎంఈఓగా తులసిప్రియ, ప్రధానోపాధ్యాయుడిగా సాత్విక్ బాధ్యతలు చేపట్టారు. అలాగే ఉపాధ్యాయులుగా ముస్కాన్, వైష్ణవి, లక్ష్మీ దుర్గ, రిషిత, శివాని, చిత్ర,సాత్విక్, షోహన్, నిశాంత్, గౌడ్, మేనక తదితరులు విధులు నిర్వహించారు. అటెండర్‌గా హరిప్రసాద్ బాధ్యతలు నిర్వర్తించారు. విద్యార్థులు తమకు అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వహిస్తూ పాఠశాల నిర్వహణలో చురుకుగా పాల్గొన్నారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో పాఠాలు బోధించడం, హాజరు నమోదు చేయడం, విద్యార్థుల నియంత్రణ వంటి పనులను విద్యార్థులే నిర్వహించడం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సుధారాణి, రాజు, శ్రవణ్ పర్యవేక్షించారు. ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ దండెం సుశీల, చైర్మన్ చంద్రమ్మ హాజరై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో స్కావెంజర్ సాయమ్మతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు మానస,అనసూయ తదితరులు పాల్గొన్నారు. స్వయంపాలన దినోత్సవం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ గుణాలు, బాధ్యతా భావం పెంపొందుతాయని ఉపాధ్యాయులు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ఉపయోగ పడతాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక సదరం శిబిరం విజయవంతం...



నాగర్‌కర్నూల్//**మార్చి 09 (ఆకాంక్ష) :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సదరం శిబిరం విజయవంతంగా ముగిసింది. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తీవ్రమైన నరాల బలహీనత, తీవ్రమైన కండరాల బలహీనతతో బాధపడుతున్న వారికి ఈ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని జనరల్ ఆసుపత్రి డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వి. శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వివిధ రకాల అంగవైకల్యాలతో ధ్రువీకరణ పత్రాలు పొందినప్పటికీ, కాలక్రమేణా వారి శారీరక పరిస్థితుల్లో వచ్చిన మార్పులను గుర్తించేందుకు ప్రత్యేకంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరానికి మొత్తం 56 మందిని గుర్తించగా, అందులో 44 మంది హాజరై ప్రత్యేక వైద్యుల బృందం ద్వారా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే. రవికుమార్ నాయక్ నాయకత్వంలో వైద్య నిపుణులు హాజరైన వారికి నరాలు, కండరాల బలహీనతలపై ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా శిబిరంలో భాగంగా కంటి చూపు లోపంతో బాధపడుతున్న వారికి కూడా ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్న 10 మంది రోగులను కంటి విభాగం వైద్యులు డాక్టర్ ప్రియాంక నేతృత్వంలోని వైద్య బృందం పరిశీలించి అవసరమైన సూచనలు అందించారు. దాదాపు 100 శాతం అంగవైకల్యం ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్తులో అధిక మొత్తంలో పెన్షన్ మంజూరు చేయనున్నట్లు సదరం అధికారులు తెలిపారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సదరం శిబిరం అధికారులు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి. శ్రీనివాసులు, క్యాంప్ అడ్మిన్ ఏ. నరసింహారెడ్డి, క్యాంప్ కోఆర్డినేటర్ పి. ప్రభాకర్, క్యాంప్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఏ. హైమావతి, ధాన్ గట్ల చంద్రశేఖర్, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజుల, నర్సింగ్ అధికారులు ఎం. ఆనంద్, సిబ్బంది యాదగిరి తదితరులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రోగులు శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

## పాలెం గ్రామంలో గ్రామ సభ విజయవంతం...



నాగర్ కర్నూల్ టౌన్//**మార్చి 09 (ఆకాంక్ష)** : నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం లోపాలెం గ్రామంలో సోమవారం గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ బోనాసి రామకృష్ణ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. గ్రామ అభివృద్ధికి అందరి సహకారం అవసరమని సర్పంచ్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకుని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ వేసవిలో గ్రామంలో ఇంటింటా నల్ల ఏర్పాటు చేసే చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాత శివాలయం ముందు ఉన్న సింగిల్ ఫేస్ బోరు సమస్యను త్వరలోనే రిపేర్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. గ్రామంలో దోమల బెడద పెరగడంతో మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా నివారణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మురికి కాలువలు, చెత్త చెదారం తొలగించి శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని గ్రామస్తులకు సూచించారు. వేసవి కాలం దృష్ట్యా ఆరోగ్య శాఖ ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాత్రి సమయంలో దోమల నిర్మూలన కోసం మందులు స్ప్రే చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ సువర్ణ, జీపీఓ మంజుల, వార్డు సభ్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ ధరల పెంపు తక్షణమే ఉపసంహరించాలి...

### సీపీఎం నిరసన...




గోదావరిఖని//**మార్చి 09 (ఆకాంక్ష) :** కేంద్ర బీజేపీ ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వేల్పుల కుమారస్వామి డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని చౌరస్తాలో సోమవారం సీపీఎం గోదావరిఖని పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్లే కార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.60, కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌పై రూ.115 పెంపు దేశ ప్రజలపై భారీ భారం మోపుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ధరల పెంపు కారణంగా దేశ ప్రజలపై సుమారు రూ.60 వేల కోట్ల అదనపు భారం పడుతుందని అన్నారు. గ్యాస్ ధరల పెంపు వల్ల ఇతర నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా యుద్ధం జరుగుతోందనే పేరుతో చమురు నిల్వల కొరత ఉందని చెప్పి గ్యాస్ ధరలను పెంచడం సరైంది కాదని ఆయన విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తనను తాను విశ్వగురువుగా చెప్పుకుంటున్నప్పటికీ ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలను ఆపేందుకు ఎందుకు ముందుకు రావడం లేదని ఆయన ప్రశ్నించారు. అమెరికా ప్రభావంలో దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో ఇరాన్‌పై యుద్ధం కొనసాగితే పెట్రోల్, డీజిల్ ధరలు కూడా మరింత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. గ్యాస్ ధరల పెంపును వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) పిలుపునిచ్చిందని తెలిపారు. అమెరికా చెప్పిందే వినే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని, చమురు దిగుమతులు చేయొద్దని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పగా ప్రధాని మోడీ ఆయనకు మొగ్గు చూపుతున్నారని విమర్శించారు. దేశ ప్రజలు ఈ పరిస్థితిని గ్రహించి ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులను నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు నెర్వట్ల నర్సయ్య, పర్శరాములు, రంగన్న, తిరుపతి, రాజన్న, రాంబాబు, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులను సర్పంచ్ భర్త బెదిరిస్తున్నాడని కలెక్టర్‌కు ఫిర్యాదు...



పెద్దపల్లి//**మార్చి 09 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం వడ్కాపూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పరిధిలోని చెరువుల్లో చేపలు పట్టుకునే హక్కును అడ్డుకుంటూ వెంకట్రావుపల్లి గ్రామ సర్పంచ్ భర్త మరియు అతని అనుచరులు బెదిరింపులకు పాల్పడుతున్నారని మత్స్యకారులు ఆరోపించారు. ఈ విషయమై సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌ను ప్రజావాణి కార్యక్రమంలో కలిసి వడ్కాపూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి మాట్లాడుతూ వడ్కాపూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం రిజిస్ట్రేషన్ నంబర్ ఖ-156 కాగా, సంఘంలో సుమారు 150 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. వడ్కాపూర్ మరియు వెంకట్రావుపల్లి గ్రామాలకు సంబంధించిన చెరువులు ఈ సంఘం పరిధిలో ఉన్నాయని, రెండు గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఈ సంఘంలో సభ్యులుగా ఉండి చాలా కాలంగా చెరువుల ద్వారా జీవనోపాధి పొందుతున్నామని వివరించారు. చెరువులపై ప్రభుత్వం విధించే శిస్తును క్రమంగా చెల్లిస్తూ చేపల పెంపకం, వేట కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అయితే ఇటీవల కాలంలో వెంకట్రావుపల్లి గ్రామ సర్పంచ్ భర్త మచ్చ యాదగిరి తన అనుచరులు, కొంతమంది వార్డు సభ్యులతో కలిసి చెరువులకు వెళ్లే మత్స్యకారులను అడ్డుకుంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. చెరువులో చేపలు పట్టుకోవాలంటే లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడని, తాను సర్పంచ్ ఎన్నికల్లో రూ.30 లక్షలు ఖర్చు చేశానని చెప్పుతూ డబ్బులు ఇవ్వకపోతే చెరువులో విషం కలిపి చేపలను చంపేస్తానని బెదిరిస్తున్నాడని మత్స్యకారులు కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ ఘటనల వల్ల మత్స్యకారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో తమపై దౌర్జన్యాలకు పాల్పడుతున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుని చెరువుల్లో చేపలు పట్టుకునే తమ హక్కులను కాపాడాలని మత్స్యకారులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హక్కుల ప్రకారం తమ జీవనోపాధి కొనసాగించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన వారిలో వడ్కాపూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కనకట్ల స్వామి, ఉపాధ్యక్షులు జెట్టి సతీష్, కార్యదర్శి తీగల రమేష్, డైరెక్టర్లు జెట్టి రాజయ్య, జెట్టి వెంకటేశం, కనకట్ల నర్సింగం, కనకట్ల శ్రీనివాస్, కనకట్ల శైలేందర్, చిక్కుడు స్వామి, యాదగిరి లచ్చయ్య,గీకురు చంద్రయ్య, కనకట్ల లచ్చయ్య, రాజయ్య, కొండయ్యతో పాటు సుమారు 150 మంది సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ప్రచార రథానికి కలెక్టర్ కోయ శ్రీ హర్ష శ్రీకారం...






పెద్దపల్లి//**మార్చి 09 (ఆకాంక్ష) :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పిలుపునిచ్చారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయం ప్రాంగణంలో ఈ పథకానికి సంబంధించిన ప్రత్యేక ప్రచార రథాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు మొత్తం 99 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక శక్తి అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీ రెడ్కో) ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రామాలు, పట్టణాలు, మున్సిపాలిటీలలో ప్రజలకు ఈ పథకం ప్రయోజనాలపై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. ప్రతి విద్యుత్ వినియోగదారుడు తమ ఇళ్ల పైకప్పులపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని, దీనివల్ల విద్యుత్ బిల్లులు గణనీయంగా తగ్గుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు కూడా సోలార్ విద్యుత్ ఎంతో ఉపయోగకరమని, కార్బన్ ఉద్గారాలను జీరో స్థాయికి తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో కనీసం పది మంది లబ్ధిదారులు తమ ఇళ్ల పైకప్పులపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మూడు కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం రూ.78,000 వరకు సబ్సిడీ అందిస్తుందని, దీనివల్ల ప్రతి నెల సుమారు రూ.2,000 వరకు విద్యుత్ బిల్లులో ఆదా చేసుకోవచ్చని ఆయన వివరించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా పర్యావరణ హితమని, అవసరానికి మించిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అందజేసి అదనపు ఆదాయం కూడా పొందే అవకాశముందని కలెక్టర్ సూచించారు. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను ప్రతి ఒక్కరు వినియోగించుకుని ఆర్థికంగా, పర్యావరణ పరంగా లాభాలు పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ వి. గంగాధర్, డీఈ రాజ బ్రహ్మయ్య చారి, రెడ్కో జిల్లా మేనేజర్ డి. మనోహర్, జిల్లా సహకార అధికారి శ్రీ మాల, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష...

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి...



పెద్దపల్లి//**మార్చి 09 (ఆకాంక్ష) :** ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు అందజేసే అర్జీలను త్వరితగతిన పరిశీలించి, పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం కీలక వేదికగా ఉండటంతో ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో తీసుకొని చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి. వేణుతో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. వివిధ మండలాలు, గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న కలెక్టర్, సంబంధిత శాఖాధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. సుల్తానాబాద్ పట్టణం మార్కండేయ కాలనీకి చెందిన గంగాదేవి శ్రీనివాస్ దివ్యాంగ పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు సూచిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా భోజన్నపేట గ్రామానికి చెందిన ఆవుల వసంత తమ గ్రామంలో ఇంటి నిర్మాణం చేపడుతున్న సమయంలో కొందరు అనుమతి లేదంటూ నిర్మాణ పనులను అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ విచారణ చేపట్టి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెద్దపల్లి మండలం అందుగులపల్లి గ్రామానికి చెందిన సంపూర్ణకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయినప్పటికీ బేస్మెంట్ వరకు నిర్మాణం చేసిన తర్వాత కూడా మొదటి విడత బిల్లు డబ్బులు అందలేదని అర్జీ సమర్పించారు. ఈ విషయంపై కలెక్టర్ హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు సూచిస్తూ అవసరమైన చర్యలు తీసుకొని సంబంధిత లబ్ధిదారికి బిల్లు విడుదల చేయాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించారు. ప్రజల సమస్యలను సమగ్రంగా పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కారం చూపించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చెత్త రహిత రామగుండం లక్ష్యంగా 5కే రన్...

### ప్రజలందరూ భాగస్వాములు కావాలి...

### ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్...



గోదావరిఖని//**మార్చి 09 (ఆకాంక్ష) :** రామగుండం నగరాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రామగుండం శాసన సభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన 5కే రన్ కార్యక్రమాన్ని మేయర్ మహంకాళి స్వామితో కలిసి పచ్చజెండా ఊపి ఆయన ప్రారంభించారు. నగర పాలక సంస్థ కార్యాలయం నుండి గోదావరిఖని చౌరస్తా వరకు ఈ రన్ నిర్వహించగా, అనంతరం చౌరస్తాలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను చేపడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజలకు అద్భుతమైన పరిపాలన అందిస్తున్నదన్నారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళిక ప్రధాన ఉద్దేశ్యం నగరాన్ని పరిశుభ్రమైన, సుందరమైన నగరంగా తీర్చిదిద్దడమేనని తెలిపారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పచ్చదనం, ల్యాండ్‌స్కేప్‌లతో నగరాన్ని అందంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. మహిళా సంక్షేమ కార్యక్రమాలను తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందని పేర్కొన్న ఆయన, స్వయం సహాయక సంఘాల మహిళలు స్వంత వ్యాపారాలు ప్రారంభించేందుకు కోట్లాది రూపాయల సబ్సిడీ రుణాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ రంగంలో లక్ష ఉద్యోగాలు, ప్రైవేటు రంగంలో రెండు లక్షల ఉద్యోగాలను తమ ప్రభుత్వం కల్పించిందని వెల్లడించారు. రామగుండం నగర పునర్నిర్మాణం వేగంగా జరుగుతోందని, రోడ్ల విస్తరణతో పాటు వాణిజ్య భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. రాబోయే రెండేళ్లలో అన్ని రంగాల్లో రామగుండం అభివృద్ధి చెంది ఇతర ప్రాంతాల ప్రజలను ఆకర్షించే విధంగా మారుతుందని అన్నారు. మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ తమ పాలకవర్గం సానిటేషన్‌కు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలు చెత్తను బయట పడవేయకుండా నగర పాలక సంస్థ స్వచ్ఛ వాహనాలకే అందజేయాలని కోరారు. చెత్తను రోడ్లపై పడవేసి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే వారిపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ నేతృత్వంలో సుమారు 800 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో రామగుండం నగర రూపురేఖలు త్వరలో పూర్తిగా మారనున్నాయని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, పలువురు కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, ఎస్ఈ గురువీర, ఈఈ పి.వి. రామన్, ఏసీపీ శ్రీహరి, టీపీఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, సీడీపీఓ అలేఖ్య పటేల్, వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, మెప్మా సిబ్బంది, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కమాండెంట్లు తిరుపతి, కేదం శ్రీనివాస్, నగర పాలక సంస్థ ఉద్యోగులు, వాకర్స్ తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, మేయర్ మహంకాళి స్వామి ఆద్యంతం పరుగెత్తుతూ పాల్గొన్న వారిని ఉత్సాహపరిచారు.

## విద్యార్థులకు ఉచిత ఐడి కార్డులు, టైలు, బెల్టుల పంపిణీ...



నాగర్ కర్నూల్ టౌన్//**మార్చి 09 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ మండలం బిజినేపల్లి పరిధిలోని కారుకొండ ప్రథమ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఉచితంగా ఐడి కార్డులు, టైలు, బెల్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సురభి ఉమారాణి, శేఖర్ రావు పాల్గొని విద్యార్థులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు కూడా ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో మంచి ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీ రామాలయం నూతన ధ్వజస్తంభం నిర్మాణానికి ఉదార విరాళాలు...



వెల్దుర్తి //**మార్చి 09 (ఆకాంక్ష) :**కర్నూలు జిల్లా పత్తికొండ నియోజక వర్గం అయిన వెల్దుర్తి మండలం పరిధిలోని సుదేపల్లి గ్రామంలోని శ్రీ రామాలయం నూతన ధ్వజస్తంభం నిర్మాణానికి గ్రామస్థులు, భక్తులు ఉదారంగా విరాళాలు అందజేస్తున్నారు. ఆలయ అభివృద్ధికి గ్రామ ప్రజలు ముందుకు వచ్చి తమ వంతు సహాయాన్ని అందించడం అభినందనీయమని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యం కుశాంక్ ఆర్య వర్ధన్ తల్లిదండ్రులు వైద్యం హరినాథ్ రేవతి దంపతులు రూ.25,000 విరాళంగా అందజేశారు. అలాగే మరెడ్డి ప్రతాపరెడ్డి కుమారుడు శ్రీనివాస్ రెడ్డి కూడా రూ.25,000 విరాళాన్ని శ్రీ రామాలయ కమిటీకి అందజేశారు. ఈ విరాళాలను ఆలయ కమిటీ సభ్యులు స్వీకరించి దాతలను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ నూతన ధ్వజస్తంభం నిర్మాణం పూర్తయితే గ్రామానికి మరింత ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడుతుందని, భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనానికి వచ్చే అవకాశముందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గ్రామంలోని భక్తులు మరియు దాతలు ఈ విధంగా ముందుకు వచ్చి సహకరించడం వల్ల ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని వారు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆలయ అభివృద్ధి కోసం గ్రామ ప్రజలు, దాతలు ఇదే విధంగా సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.